ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

- వేసవి ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం
- భువనేశ్వర్ నుంచి దువ్వాడ మీదుగా ముంబైకి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మే 17: వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని దువ్వాడ మీదుగా నడుస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొద్ది రోజులు కొనసాగించనున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు-ఖరగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను (06507) ఈనెల 24 నుంచి జూన్ 14 వరకు, ఖరగ్‌పూర్-ఎస్ఎంవీ బెంగళూరు ... మిగతా 6వ పేజీలో

గంగవరం పోర్టులో సమ్మె విరమణ

నిర్వాసిత కార్మికులతో యాజమాన్యం 'సెటిల్‌మెంట్'

ఉద్యోగం వదిలేస్తే రూ.27 లక్షలు

- 400 మంది అంగీకారం... వంద మంది ప్రతికూలం
- రెగ్యులర్ ఉద్యోగులకు వేతనాల పెంపు
- కుటుంబానికి వైద్య సదుపాయం
- పోలీస్ కమిషనరేట్‌లో చర్చలు
- అదానీ ప్రతినిధుల హాజరు
- అధికారికంగా ఒప్పంద వివరాలు వెల్లడించని యంత్రాంగం



చర్చల్లో పాల్గొన్న నిర్వాసిత కార్మికులు, అధికారులు, అదానీ పోర్టు యాజమాన్య ప్రతినిధులు

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టులో 34 రోజులుగా జరుగుతున్న సమ్మె గురువారం అర్ధరాత్రితో ముగిసింది. నిర్వాసిత కార్మికులతో పోలీస్ కమిషనరేట్‌లో జిల్లా అధికారులు, అదానీ పోర్టు యాజమాన్య ప్రతినిధులు చర్చలు జరిపారు. గతంలో నిర్వాసిత కార్మికులు సమ్మె విరమించడానికి, ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపోవడానికి ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చొప్పున డిమాండ్ చేశారు. నాటి చర్చల్లో రూ.25 లక్షలు చొప్పున ఇప్పిస్తామని పోలీస్ కమిషనర్ హామీ ఇచ్చారు. తాజాగా గురువారం జరిగిన ఒప్పందంలో ఉద్యోగం వదిలేసి వెళ్లిపోతే సింగిల్ సెటిల్‌మెంట్ కింద ఒక్కొక్కరికి రూ.27 లక్షలు ఇవ్వడానికి ఇరు వర్గాల మధ్య ఒప్పందం జరిగింది. పోర్టులో నిర్వాసిత కార్మికులు మొత్తం 514 మంది ఉన్నారు. ఈ ఒప్పందానికి వారిలో 400 మంది ఒప్పుకున్నారు. మిగిలిన వారు తాము ఉద్యోగాలు చేసుకుంటామని, సెటిల్‌మెంట్ అవసరం లేదని చెప్పారు. అయితే దానికి పోర్టు యాజమాన్య ప్రతినిధులు ఒప్పుకోలేదు. ఇదిలావుండగా ఇస్తామని చెప్పిన మొత్తం 45 రోజుల్లో అందిస్తామని పోర్టు ప్రతినిధులు చెప్పగా, తమకు నెల రోజులుగా జీతాలు లేవని, తక్షణమే కొంత ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేయగా రెండు, మూడు రోజుల్లో మనిషికి లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. దాంతో కార్మికులు సమ్మె విరమించారు. పోర్టు నుంచి శుక్రవారం తెల్లవారుజామున కోకింగ్ కోల్, లైమ్ స్టోన్ సరఫరా ప్రారంభించారు. ఈ ఒప్పందాన్ని వ్యతిరేకించిన కార్మికులు శుక్రవారం విధుల్లోకి వెళ్లగా... వారిని లోపలకు రానివ్వలేదని తెలిసింది. వారితోను చర్చలు జరుపుతున్నారు.

వారి కుటుంబానికి వైద్య సదుపాయం

పోర్టులో నిర్వాసిత కార్మికులు కాకుండా రెగ్యులర్ కార్మికులు వెయ్యి మందికి పైగా ఉన్నారు. వారు కూడా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు సహకరించారు. పోలీస్ కమిషనరేట్‌లో ... మిగతా 6వ పేజీలో

ఉక్కుకు ఊరట

- విధుల్లోకి గంగవరం పోర్టు కార్మికులు
- స్టీల్‌ప్లాంటుకు కన్వేయర్ బెల్ట్ ద్వారా కోకింగ్ కోల్, లైమ్ స్టోన్ సరఫరా
- అన్ని వర్గాల్లో సంతోషం



కన్వేయర్ బెల్ట్ ద్వారా సరఫరా అవుతున్న కోకింగ్ కోల్

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఎట్టకేలకు ముడి పదార్థాల కొరత తీరింది. అదానీ గంగవరం పోర్టులో కార్మికుల సమ్మె వల్ల నెల రోజుల నుంచి ఉక్కు కర్మాగారానికి కోకింగ్ కోల్, లైమ్ స్టోన్ సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ప్లాంటులో ఏ ప్రక్రియ ముందుకు సాగాలన్నా కోకింగ్ కోల్ చాలా అవసరం. కోక్ ఓవెన్ బ్యాటరీల నిర్వహణకు, విద్యుత్ ఉత్పత్తికి, వృథా వాయువులు అందించే అనేక విభాగాలకు కోకింగ్ కోల్ అవసరం. అయితే కోకింగ్ కోల్ సరఫరా పూర్తిగా ఆగిపోవడంతో ఉక్కు ఉత్పత్తి 80 శాతానికిపైగా పడిపోయింది. రోజుకు 20 వేల టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉండగా మూడు, నాలుగు వేల టన్నులకు పరిమితమైంది. మరోవైపు అతి తక్కువ బొగ్గుతో కోక్ ఓవెన్ల నిర్వహణ కష్టం కావడంతో వాటిలో కొన్నింటిని తగ్గించి, తక్కువ స్థాయిలో నడపాల్సి వచ్చింది. బ్లాస్ట్ ఫర్నేస్‌లు రెండింటిలో ఒకదాని నుంచి ఉత్పత్తి తీశారు. ఈ ఇబ్బందుల వల్ల యాజమాన్యం, అధికారులు, కార్మికులు చాలా ఒత్తిడికి గురయ్యారు. సుమారు రూ.600 కోట్ల విలువైన సరకు పోర్టులో ఉండిపోయింది. మరోవైపుసరైన ఉత్పత్తి లేక మూడు వేల కోట్ల రూపాయల వరకు నష్టాలు వచ్చే పరిస్థితి ఏర్పడింది. స్టీల్ అధికారుల సంఘం చొరవ తీసుకొని హైకోర్టును ఆశ్రయించడంతో కొంత ఊరట లభించింది. జాతీయ సంపద అయిన విశాఖ ఉక్కును సంరక్షించుకోవాలని, ఇబ్బంది పెట్టకూడదని, అంతా సహకరించాలని న్యాయస్థానం సూచించడంతో పోర్టు యాజమాన్యం దిగి వచ్చి చర్చలు ప్రారంభించింది. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి కన్వేయర్ బెల్ట్ ద్వారా స్టీల్‌ప్లాంటుకు కోకింగ్ కోల్, లైమ్ స్టోన్ సరఫరాను పోర్టు ప్రారంభించింది. ఎట్టకేలకు 34 రోజుల తరువాత బొగ్గు, లైమ్‌స్టోన్ అందడంతో స్టీల్ ప్లాంటు వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి. ఐరన్ ఓర్ కూడా తగినంత సమకూర్చుకొని పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడానికి యత్నిస్తామని యాజమాన్యం ప్రకటించింది.

ఎక్సైజ్ చేతివాటం

ఎన్నికల సమయంలో మద్యం అమ్మకాలపై సీలింగ్

- గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో కంటే అమ్మకాలు పెరగకూడదని ఎన్నికల సంఘం ఆదేశం
- మరీ అవసరమనుకంటే కాస్త వెసులుబాటు ఇవ్వొచ్చునని సూచన
- దుకాణాలకు నిర్దేశించిన మేరకు కేటాయింపు
- బార్‌లకు మాత్రం అదనంగా సరఫరా
- రేటు పెంచి సొమ్ము చేసుకున్న నిర్వాహకులు
- బాక్స్‌కు రూ.వంద చొప్పున అధికారులు మామూళ్లు తీసుకున్నట్టు ఆరోపణలు
- అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్న డిపో మేనేజర్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మద్యం విక్రయాల్లో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మద్యం దుకాణాల్లో అమ్మకాలపై సీలింగ్ విధించారు. అదే సమయంలో బార్లకు మాత్రం కేటాయింపులు పెంచి వారి నుంచి భారీగా మామూళ్లు తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది.

జిల్లాలో 139 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 128 బార్‌లు ఉన్నాయి. వీటన్నింటికీ అవసరమైన మద్యాన్ని ఆనందపురం డిపో నుంచి సరఫరా చేస్తుంటారు. ప్రతి నెలా సగటున 1.5 లక్షల మద్యం కేసులు, మరో 1.6 లక్షల బీర్ కేసులు అమ్ముడవుతుంటాయి. సార్వత్రిక ఎన్నికలకు గత నెల 18న ఎన్నికల షెడ్యూల్ విడుదలవ్వడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. ఓటర్లకు రాజకీయ పార్టీలు మద్యం ఇచ్చి ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందని ఎన్నికల సంఘం విక్రయాలపై కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగిన అమ్మకాల మేరకు మాత్రమే దుకాణాలకు, బార్‌లకు కేటాయింపులు జరపాలని సూచించింది. ఒకవేళ రద్దీ ఎక్కువగా ఉంటే మాత్రం కొంత అదనంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది. ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ 'వెసులుబాటు'ను తమకు అనుకూలంగా మార్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయాలపై సీలింగ్ విధించారు. నిర్దేశించిన మేర సరకు అయిపోయిన వెంటనే కౌంటర్ మూసేయాలంటూ సిబ్బందిని ఆదేశించారు. అంతకుమించి విక్రయాలు చేయకుండా ఉండేందుకు ప్రత్యేకంగా ఎక్సైజ్ కానిస్టేబుళ్లు, ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఎన్నికల సంఘం ఆదేశాలు కాబట్టి పక్కాగా అమలుచేయాల్సిందేనంటూ అధికారులు చెప్పడంతో ఎవరికీ అనుమానం రాలేదు. అయితే బార్ల విషయంలో మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరించారని ఆ శాఖ సిబ్బందే పేర్కొంటున్నారు. బార్లకు ఎప్పటిలాగే మద్యం కేటాయింపులు చేస్తూనే, డిమాండ్ ఉంటే కొంత అదనంగా ఇవ్వొచ్చునన్న ఎన్నికల సంఘం వెసులుబాటును ఎక్సైజ్ శాఖ అధికారులు కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ప్రభుత్వ దుకాణాలకు కాకుండా కేవలం బార్లకు మాత్రం అదనంగా సరకు కేటాయింపులు జరిపారు. ఇందుకోసం ఒక్కో కేస్ (బాక్స్)కి రూ.వంద చొప్పున బార్ల యజమానుల నుంచి అధికారులు తీసుకున్నారని సిబ్బంది అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈ విషయం బయటకు వచ్చింది. దుకాణాల్లో మద్యం విక్రయాలు జరిగితే ప్రభుత్వానికే నేరుగా ఆదాయం సమకూరుతుంది. అదే బార్‌లో అయితే ఎంఆర్‌పీ కంటే అదనంగా విక్రయిస్తుంటారు. ఎన్నికల సీజన్ కావడంతో మద్యానికి డిమాండ్ పెరగడం..ప్రభుత్వ దుకాణాల్లో సరకు కొరత కారణంగా బార్లలో విపరీతంగా పెంచి విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారని సిబ్బంది చెబుతున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఎలాంటి అదనపు ఆదాయం ... మిగతా 6వ పేజీలో

రైతుబజార్లలో అడ్డగోలుగా పండ్ల దుకాణాలు

- ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కేటాయింపు
- డ్రా తీసి ఇవ్వడాని బుకాయింపు
- చక్రం తిప్పిన మార్కెటింగ్ శాఖాధికారులు



రైతుబజార్‌లోని పండ్ల దుకాణం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని రైతుబజార్లలో దుకాణం కావాలంటే మంత్రి స్థాయిలో సిఫారసు ఉండాల్సిందే. అలా రికమెండేషన్ చేయించుకున్నా ఇంతకుముందు పనిచేసిన జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ పట్టించుకునే వారు కాదు. అర్హతను బట్టే కేటాయించేవారు. మొత్తం బజార్లలో ఎన్ని స్టాళ్లు (దుకాణాలు) ఖాళీ ఉన్నాయో లెక్కలు తెప్పించుకొని, పంటలు పండిస్తున్న రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి, అందరి సమక్షంలో డ్రా తీసి స్టాళ్లు కేటాయించారు. కానీ కొత్త అధికారి వచ్చాక మార్కెటింగ్ శాఖ ఈ విధానానికి ఫుల్‌స్టాప్ పెట్టింది.

ఎన్నికల కోడ్ అమలులో ఉండగా నగరంలోని పలు బజార్లలో పండ్ల విక్రేతలకు సుమారు 18 దుకాణాలు కేటాయించారు. ఏ ప్రాతిపదికన కేటాయించారనేది ఎవరికీ తెలియదు. ఎవరైనా సరే సొంత పొలం పత్రాలు లేదా కౌలుకు చేస్తున్నట్టయితే దానికి సంబంధించిన ఆధారాలు, ఆ భూమిలో పంటలు పండిస్తున్నట్టు స్థానిక వ్యవసాయ శాఖాధికారి, ఉద్యాన అధికారి సిఫారసు ఉంటేనే వారి దరఖాస్తును పరిగణనలోకి తీసుకునేవారు. అటువంటి వారి పేర్లతోనే డ్రా తీసి స్టాళ్లు ఇచ్చేవారు. ప్రస్తుతం పండ్ల దుకాణాలు కేటాయిస్తున్నామని గాని, వాటికి డ్రా నిర్వహిస్తున్నామని గానీ ఎటువంటి ప్రకటన జారీ చేయలేదు.

ఇప్పుడు రైతుబజార్లలో డ్రాగన్ ఫ్రూట్లు, మామిడి, నారింజ, ఆపిల్, పైనాపిల్, సపోటా, జామ, ఇలా ఒకటేమిటి? అన్ని రకాల పండ్లు అమ్ముతున్నారు. వాటిలో కనీసం రెండు, మూడు రకాలు కూడా వారు పండించడం లేదు. కొని తీసుకువచ్చి అమ్ముతున్నారు. అయినా వారికి స్టాళ్లు కేటాయించారు. వారు అసలు రైతులా?, వ్యాపారులా? అనేది తెలియదు. ఎన్నికల సమయంలో ఎలా స్టాళ్లు కేటాయించారు? వారి నుంచి ఎటువంటి పత్రాలు తీసుకున్నారో తెలియదు. ఈ విషయంలో ఆ శాఖలో కొందరు చక్రం తిప్పి దుకాణాలు ఇప్పించారని ప్రచారం జరుగుతోంది. కేవలం పండ్ల విక్రేతలకే ప్రత్యేకంగా డ్రా తీసిన సందర్భం ... మిగతా 6వ పేజీలో

స్ట్రాంగ్‌రూమ్‌లకు మూడంచెల భద్రత

తొలి అంచెలో రాష్ట్ర పోలీసులు

రెండో అంచెలో ప్రత్యేక పోలీసులు

- గదుల చుట్టూ వలయంగా కేంద్ర బలగాలు
- ప్రతిరోజు తనిఖీలు... సీసీ కెమెరాలు ఏర్పాటు



స్ట్రాంగ్‌రూమ్ లాగ్ బుక్‌లో సంతకం చేస్తున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో సీపీ రవిశంకర్ అయ్యన్నార్, జేసీ మయూర్ అశోక్, భీమిలి ఆర్వో భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన గదుల (స్ట్రాంగ్‌రూమ్) వద్ద మూడంచెల భద్రతా ఏర్పాటుచేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర బలగాలు (సీఐఎస్ఎఫ్ జవాన్లు) కాపలా ఉంటాయి. మధ్యలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ప్రత్యేక పోలీసులు, బయట ప్రధాన గేటు వద్ద సివిల్ పోలీసుల బందోబస్తు ఉంటుంది. ఈ మూడంచెలలో 24 గంటలపాటు సిబ్బంది మూడు షిఫ్టులలో పనిచేస్తారు. స్ట్రాంగ్‌రూమ్‌లకు తాళాలు వేసి సీల్ వేశారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని న్యూ క్లాస్‌రూమ్ కాంప్లెక్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, కెమికల్, ఇనుస్ట్రుమెంటేషన్ విభాగాలతోపాటు ప్రిన్సిపాల్ భవనంలో ఈవీఎంలు భద్రపరిచారు. ఈవీఎంల భద్రతపై జిల్లా ఎన్నికల అధికారి, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, నగర పోలీస్ కమిషనర్‌తోపాటు పోటీలో అభ్యర్థులు లేదా వారి తరఫున జనరల్ ఏజెంట్లు ప్రతిరోజు తనిఖీ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటలు, మధ్యాహ్నం రెండు గంటలు, రాత్రి పది గంటల సమయంలో ఒకసారి ఈవీఎంలు భద్రపరిచిన గది వద్దకు వెళ్లి తాళాలు, దానిపై వేసిన సీల్‌ను పరిశీలించుకోవచ్చు. కాగా శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ రవిశంకర్ అయ్యనార్‌లు, అభ్యర్థులు, జనరల్ ఏజెంట్ల సమయంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రతకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ వివరించారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. అన్ని విభాగాల అధికారులు, పోలీస్ సిబ్బంది విధి నిర్వహణపై ఆరా ... మిగతా 6వ పేజీలో

కొందరికే దీవెన

- 2023-24 విద్యా సంవత్సరం అక్టోబరు, నవంబరు, డిసెంబరు త్రైమాసికం ఫీజు విడుదలకు మార్చిలో బటన్ నొక్కిన జగన్
- రెండున్నర నెలలు తరువాత విడుదల చేసిన ప్రభుత్వం..
- అయితే కొందరి అకౌంట్లలోనే జమ
- మిగిలిన విద్యార్థుల్లో ఆందోళన
- సమయం పడుతుందంటున్న అధికారులు

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి):

'జగనన్న విద్యాదీవెన' డబ్బులు కొంతమందికే జమ అవుతుండడంతో మిగిలిన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలోనూ కొంతమంది సొమ్ములు అందక నష్టపోయారు. ఇప్పుడు కూడా అటువంటి పరిస్థితి ఎదురవుతుందేమోనన్న ఆందోళనలో ఉన్నారు.

గత (2023-24) విద్యా సంవత్సరం తొలి త్రైమాసికం (అక్టోబరు, నవంబరు, డిసెంబరు) ఫీజు చెల్లింపునకు ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. అయితే డబ్బులు మాత్రం పడలేదు. పోలింగ్‌కు రెండు రోజులు ముందు నిధులు విడుదల చేస్తామంటూ ప్రభుత్వం హడావుడి చేసింది. ఈసీ అభ్యంతరాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే ఎన్నికలు ముగిసి నాలుగు రోజులైనా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడకపోవడంపై విమర్శలు రావడంతో విద్యా దీవెనతోపాటు ఇతర పథకాలకు సంబంధించిన నగదును లబ్ధిదారులు ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రభుత్వం గురువారం ప్రకటించింది.

రూ.34.12 కోట్లు జమ కావాలి

జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో 44,177 మంది చదువుతున్నారు. వీరికి తొలివిడతగా రూ.34.72 కోట్లు జమ కావాల్సి ఉంది. అయితే కొందరి అకౌంట్లలో డబ్బులు జమ కాగా, చాలామందికి రాలేదు. ఇదే ఇప్పుడు ఆందోళనకు గురిచేస్తోంది. ఈ మొత్తం తొలి త్రైమాసికానికి సంబంధించినది. మరో మూడు విడతలకు సంబంధించిన మొత్తాలు ఇంకా విడుదల కావాల్సి ఉంది. అవన్నీ ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

తీవ్రజాప్యంతో తప్పని అవస్థలు

సీఎం జగన్ షెడ్యూల్ ప్రకారం బటన్ నొక్కడం తప్పితే.. సకాలంలో డబ్బులు జమ చేసింది లేదని విద్యార్థులు చెబుతున్నారు. కాలేజీ యాజమాన్యాలతో తమకు ఇబ్బంది తప్ప...ఈ విధానం వల్ల ఉపయోగం లేదన్న భావనను ఎప్పటి నుంచో వ్యక్తంచేస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరం తొలి త్రైమాసికానికి సంబంధించిన సొమ్మును ప్రభుత్వం విడుదల చేయనప్పటికీ యాజమాన్యాల ఒత్తిడితో విద్యార్థులు ఇప్పటికే చెల్లించేశారు. దాదాపు 90 శాతం మంది ఫీజులు కట్టేశారు. ఆర్థిక ఇబ్బందులతో పది శాతం మంది చెల్లించలేదు. వీరంతా ప్రభుత్వం విడుదల చేసే సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు. గురు, శుక్రవారాల్లో కొంతమంది విద్యార్థులకు జమ కాగా, మిగిలిన వారికి వచ్చేందుకు ఇంకెన్ని రోజులు పడుతుందో చూడాలి. ప్రతిసారి కొంతమంది విద్యార్థులకు విద్యా దీవెన చెల్లింపుల్లో కోత విధిస్తోంది. ఈసారి ఎంతమందికి ఈ సమస్య ఎదురవుతుందో అన్న ఆందోళన చాలామందిలో నెలకొంది.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



అమ్మవారికి క్షీరాభిషేక దృశ్యం

పూర్ణామార్కెట్, మే 17: వన్‌టౌన్ బురుజుపేట లోని కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక పూజలను నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారి ని అలంకరించిన అర్చకులు 12 మంది ఉభయదాత లతో ఈ పూజలు చేయించారు. ప్రతీ శుక్రవారం ఆల యంలో నిర్వహించే ఈ క్షీరాభిషేక సేవల్లో రూ.500 టికెట్ రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని ఈవో శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు



సీఐ విజయ్‌కుమార్‌కి బీపీ చెక్‌చేస్తున్న వైద్యురాలు

సీతంపేట, మే 17: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో అధికారులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వ హించారు. డాక్టర్ హేమ సీఐ విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు.ఒత్తిడితో విధులు నిర్వ హిస్తున్న పోలీసులకు సీపీ ఆదేశాల మేరకు వైద్య పరీ క్షలు చేయించినట్లు సీఐ విజయ్‌కుమార్ వివరించారు.

దివ్యాంగ యువతకు ఐటీఐలో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కంచరపాలెం/ కొమ్మాది, మే 17 : ఐటీఐ పలు ట్రేడుల్లో 2024- 25 విద్యా సంవత్సరానికి శిక్షణ పొందేం దుకు పురుష దివ్యాంగులైన అభ్యర్థులనుంచి దరఖాస్తు లను స్వీకరిస్తున్నట్టు విశాఖ జిల్లా దివ్యాంగుల కార్పొరే షన్ ప్రాజెక్టు అధికారి పి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. బక్కన్నపాలెంలోని సంస్థ కార్యాలయంలో ఈశిక్షణను అందించనున్నారు. ఐటీఐలో కార్పెంటర్ 24, షీట్‌మెటల్ వర్కర్ 20, వెల్డర్ 20, పెయింటర్ 20 సీట్లలో శిక్షణను ఏడాది పాటు అందించనున్నారు. పదో తరగతి పాస్/ఫె యిల్ అయిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఐటీఐ వె బ్‌సైట్‌లో నమోదుచేసుకోవాలని సూచించారు. దరఖా స్తు గడువుజూన్ 10వ తేదీ వరకు ఉంది. మొదటి విడత కౌన్సెలింగ్ జూన్ 1న నిర్వహిస్తామన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం బక్కన్నపా లెం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో టీడీపీ ముందంజ

మహారాణిపేట, మే 17:ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని ఇటీవల జరి గిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రజలను ఆకట్టుకున్న ట్టు ఫోర్ పాయింట్స్ టెక్నాలజీస్ సంస్థ అధినేత శివ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాల యం వద్ద ఒక సమావేశం మందిరంలో నిర్వహించిన స మావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చం ద్రబాబునాయుడు అత్యున్నత సాంకేతికత పరిజ్ఞానం అగ్మెంటెడ్ రియాలిటీతో ప్రచారం చేశారన్నారు. సూప ర్‌సిక్స్ పథకాల ప్రయోజనాలను ప్రజల వద్దకు తీసు కువెళ్లారన్నారు.

నిలకడగా కేజీహెచ్ సూపరింటెండెంట్ ఆరోగ్యం

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): గుండె పో టుకు గురైన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. బుధవారం విధుల్లో ఉండగా గుండెపోటుకు గురైన ఆయనకు అత్య వసరంగా కేజీహెచ్‌లోనే పేస్‌మేకర్ వేశారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శుక్రవారం ఉదయం పర్మినెంట్ పేస్‌మేకర్ వేసి నట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆస్ప త్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ వ్యవ హరిస్తున్నారు.

ఇగ్నోలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీ కాలనీ, మే 17 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దూర విద్యా కోర్సులతో పా టు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నామని ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ ధర్మారావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో వెబ్‌సైట్‌లోని అడ్మిషన్ లింకు ద్వారా ప్రవే శాలు పొందవచ్చునన్నారు. అన్ని కోర్సుల్లోనూ ప్రవేశాల కు దరఖాస్తు గడువు జూన్ 30 అని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 0891 2511200ను సంప్రతిం చాలని ఆయన సూచించారు.





సిటీ సెంట్రల్ పార్కు ద్వారానికి ఆనుకుని పదుల సంఖ్యలో ప్రైవేట్ బస్సులు పార్కింగ్

ట్రావెల్స్ బస్సులు పార్కింగ్‌తో రాకపోకలకు అవస్థలు

- సిటీ సెంట్రల్ పార్కు వెళ్లే మార్గంలో ఆక్రమణ
- పట్టించుకోని పోలీసులు

డాబాగార్డెన్స్, మే 17: జీవీఎంసీ 31వ వార్డులోని సిటీ సెంట్రల్ పార్కు వెళ్లే మార్గంలో రహదారిపైనే ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సులను ఇష్టానుసారంగా ప దుల సంఖ్యలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఉదయం, రాత్రి వేళల్లో వాహనదారు లు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుకు సగానికిపైగా ప్రైవే ట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సులు నిండిపోయి ఉండడంతో సమస్యలు ఎదురవుతు న్నాయి. ఇవన్నీ కళ్లముందే కనిపిస్తున్నా ట్రాఫిక్ పోలీసులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంపై సానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు పై కొద్దిసేపు ద్విచక్రవాహనాన్ని ఆపితేనే హడావుడి చేసే పోలీసులు ప్రైవేటు బస్సుల జోలికి వెళ్లడం లేదు. వారి నుంచి నిత్యం మామూళ్లు అందుతుండడమే దీనికి కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎదురుగా సిటీ సెంట్రల్ పార్కు వద్దనున్న ఫుడ్‌కోర్టుతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరా యం ఏర్పడుతోంది. ఫుడ్‌కోర్టుకు సాయంత్రం సమయంలో వెళ్లాలంటే అంబేడ్కర్ స ర్కిల్ వద్ద భారీ సంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పాటు అంబేడ్కర్ సర్కిల్ నుంచి రెడ్డంగార్డెన్స్ వెళ్లే డివైడర్ దాటే సమయం లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి ట్రావెల్స్ బస్సుల పార్కింగ్‌ను అడ్డుకోవాలని, స్థానికుల రాకపోకలకు ఇబ్బం దులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మద్యం సీసాతో దాడి

మర్రిపాలెం, మే 17: మద్యం బాటిల్‌తో వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు అందిం చిన వివరాలివి.. మాధవధార గాంధీనగర్ మహత్ కాలనీ లో ఆటో డ్రైవర్ చిన్నిసంతోష్‌కుమార్ భార్య ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. గురువారం టిఫిన్ తీసుకువచ్చి ఇంట్లో ఇచ్చి అదే కాలనీలో ఉంటున్న స్నేహితుడు వాసుతో కలిసి బయటికి వెళ్లి మద్యం సేవించి తిరిగివచ్చారు. అదేసమ యంలో సంతోష్‌కుమార్ తండ్రికి మేనల్లుడు అయిన మహేష్ తనతో తెచ్చుకున్న మద్యం బాటిల్‌తో పొడిచేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పగిలిన గాజుసీసా తగిలి సంతోష్‌కుమార్ ఎడమ కుడి కంటినుంచి దవడ వరకు చీరు కుపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్పం దించిన ఆయన అన్నయ్య ఎల్లాజీ సంతోష్‌కుమార్‌ను చికిత్స ని మిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యులకు తన పై సంతోష్ కుమార్ తప్పుగా ప్రచారం చేస్తున్నాడనే కక్షతో దాడికి పాల్పడినట్లు నిం దితుడు తెలిపినట్టు పోలీసులు చె బుతున్నారు. గాయపడిన వ్యక్తి ఫిర్యాదు పై సీఐ చక్రధరరావు నేతృత్వంలో కేసు నమోదు చేసి ఎస్సై వరలక్ష్మి దర్యాప్తు చేపడుతున్నారు.

నేడు ఎర్నిమాంబ తొలేళ్ల ఉత్సవం



అమ్మవారు

జ్ఞానాపురం, మే 17: అల్లిపురం అచ్చియ్యమ్మపేటగ్రా మస్తుల ఇలవేల్పు ఎర్నిమాంబ జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం తొలేళ్ల ఉత్సవం, ప్రధాన పండగ ఆదివారం నిర్వహించనున్నారు. 80 ఏళ్ల క్రితం ఆవిర్భ వించిన ఈ అమ్మవారు గ్రామస్థుల ఇలవేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చేతల్లిగా పేరొందారు. సంతానం లేని వారు అమ్మ వారిని వేడుకుంటే పిల్లలు పుడతారని భక్తుల విశ్వాసం. ఈ క్ర మంలో ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో భ క్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. గతంలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో దేవాలయం ఉండేది. అయితే, భక్తులు తాకిడి, ఆదాయం పెరగడంతో ఆలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేశారు. ఇటీవలే విశాఖ డెయిరీ ఆర్థిక సహాయంతో ఆలయా న్ని పునర్నిర్మించారు. అప్పటి నుంచి ఈవో పర్యవేక్షణలో ఆల యం నడుస్తోంది. ఏటా మేనెల మూడో ఆదివారం అమ్మవారి పండగ నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం తొలేళ్లు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో సురేష్‌బాబా తెలి పారు. ఈ ఉత్సవం పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి నుంచి ప్రారంభమై కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట మీదుగా ఆలయం వరకు అమ్మవారి ప్రతిమల ఊరేగింపు జరుగుతుంది. జాతర రోజు అమ్మవారిని పుష్పాలతో అలంకరిస్తామన్నారు. ఆరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ తెలిపారు.

31వ వార్డులో స్వల్పంగా పెరిగిన ఓటింగ్


- 58.3 శాతం నమోదు.. గతసారి కంటే 4శాతం అధికం
- 17,622 ఓటర్లకు గాను 10,274 మంది ఓటు వేసిన వైనం....
- ఓటు హక్కు వినియోగానికి యువ ఓటర్లు ఆసక్తి



ప్రైమరీ స్కూల్‌లో క్యూ నిల్చున్న ఓటర్లు (ఫైల్‌ఫొటో)

డాబాగార్డెన్స్, మే 17: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని 58.3 పోలింగ్ శాతం నమోదైంది. వార్డులో మొత్తం 17622 ఓటర్లు ఉండగా, 10274 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వార్డు పరిధిలోని 54, 55, 56, 199, 200 నుంచి 215, 235 పోలింగ్ బూత్‌ల ద్వారా డాబాగార్డెన్స్, గొల్లల పాలెం, చాకలిపేట, సూర్యాబాగ్, లలితాకాలనీ తదితర కేంద్రాల్లోని ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. గత సారి కంటే పోల్చుకుంటే.. ఈసారి ఎన్నికల్లో నాలుగు శాతానికి పైగా ఓటింగ్ పెరిగింది. వృద్ధులు, యువత అత్యధికంగా ఓటు హక్కును వినియో గించుకున్నారు. అయితే మరికొంత మంది ఇతరత్రా ప్రాంతాలకు వెళ్లిపోవడం, కొం దరు స్థానికంగా లేకపోవడంతో పోలింగ్ శాతంపై కొంత ప్రభావం పడింది. ఇదిలా ఉండగా ఎన్నికల ముందు ఓటర్ స్లిప్స్ ఉన్న వారికి వివిధ పార్టీలు ఓటుకు ఇంత చొప్పున డబ్బు పంపిణీ జరిగింది. కొందరికి స్లిప్‌లున్నా డబ్బు చెల్లించపోవడంతో నిరాశకు లోనయ్యారు. దీంతో వీరిలో కొందరు ఓటు వేసేందుకు వీరు పెద్దగా ఆసక్తి చూపలేదు. అలాగే, ఎండ ఓ వైపు..ఓటింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగడంతో మరికొం త మంది ఓటువేయకుండానే వెనక్కి వెళ్లిపోయారు. డాబాగార్డెన్స్‌లోని కొంతమేర వ్యాపార, వాణిజ్య ప్రాంతం కావడంతో చాలా మందికి ఓట్లు ఉన్నా, పలువురు ఇత ర ప్రాంతాలకు వెళ్లిపోయారు. కొందరికి వేరే చోట ఉన్న వారి ఓట్లను తొలగించడం తో పూర్తిస్థాయిలో ఓటింగ్ కు వీలు కాలేదు.

మోతుగూడెంలో పుష్ప-2 షూటింగ్



సీలేరు నదిలో ఎర్రచదనం దుంగలు డంప్ చేసిన సన్నివేశం దృశ్యం

మోతుగూడెం, మే 17: చిం తూరు మండలం మోతుగూడెంలో యర్ సీలేరు ప్రాజెక్టులో మంగంపా డు, పాలగడ్డ, డొంకరాయి, పొ ల్లూరు పరిసర ప్రాం తాల్లో వారం రోజులుగా చిత్రీకరించిన పుష్ప-2 సినిమా షూటింగ్ గురువారం ముగిసింది. సీలేరునదిలో దారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద కొన్ని సన్నివేశాలను చి త్రీకరించారు. ఎర్రచందనం దుం గలు సీలేరు నదిలో డంప్ చేసిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరిం చారు. శుక్రవారం జరిగిన కొన్ని సన్నివేశ చిత్రీకరణలో స్థానికులకు అవకాశం లభించడంతో ఆనందం వ్యక్తం చేశారు.

నేటినుంచి రాజస్థానీ ఫుడ్ ఫెస్టివల్

మహారాణిపేట, మే 17: సాగరతీరంలోని రాడిసన్ బ్లూ హోటల్ వేదికగా శని వారం నుంచి ఈనెల 25 వతేదీ వరకు రాజస్థాన్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్న ట్టు నిర్వాహకులు జీవీ రమేష్, రాజేష్ జోషి తెలిపారు. శుక్రవారం వారు స్థానిక విలేకరు లతో మాట్లాడారు. రాజ స్థాన్‌లో అత్యంత ప్రసిద్ధి చెందిన 70 రకాల రుచికరమైన వంటకాలను ఈ ప్రదర్శనలో ఉంచనున్నట్టు చెప్పారు. విశాఖవాసులు ఈ రుచులను ఆస్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బి కైలాష్ పాల్గొన్నారు.

వ్యక్తిగత కక్షలతోనే బర్మాక్యాంపులో దాడి

- డీసీపీ సత్తిబాబు



వివరాలను అడిగితెలుసుకుంటున్న డీసీపీ సత్తిబాబు, ఏసీపీ నరిశింహమూర్తి

కంచరపాలెం, మే 17: టీడీపీకి ఓటు వేయలేదనే నెపంతో బర్మాక్యాంప్ లో లోకేష్ అనే వ్యక్తి జరిపిన దాడిలో గాయపడిన బాధితుల ఇళ్లను పశ్చిమ డీసీపీ మేక సత్తిబాబు, ఏసీపీ అన్నెం నరిశింహమూర్తి శుక్రవారం సందర్శిం చారు. బాధితులతో వారు మాట్లాడారు. జరిగిన ఘటనపై స్థానికులనుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుంకర నూకరత్నం ఆమె తల్లి ధనలక్ష్మి తో పాటు మణికంఠపై లోకేష్ అనే వ్యక్తి దాడి చేసి గాయాలు చేసిన సంఘ టన తెలిసిందే. ఈ సంఘటనపై రాజకీయ ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో డీసీపీ, ఏసీపీలు స్వయంగా వచ్చి విచారించారు. ధనలక్ష్మి, ఆ మె కుటుంబ సభ్యులు మద్యం సేవించి బుధవారం లోకేష్ ఇంటి వద్ద న్యూసె న్స్ చేశారని, ఈ నేపథ్యంలోనే లోకేష్ వారిపై దాడి చేసినట్టు స్థానికులను విచారించగా తెలిసిందని డీసీపీ పేర్కొన్నారు. వ్యక్తిగత గొడవలకు రాజకీయ రంగు పులిమితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ సత్తిబాబు హెచ్చరించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో కంచరపాలెం ఎ స్‌ఐ దివ్యభారతి కూడా ఉన్నారు.

ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదకరం

- కేజీహెచ్ డౌన్ పోలీస్ క్వార్టర్స్ నుంచి లేపాక్షి వెళ్లే మార్గం తీరు



కుమ్మరివీధిలో రోడ్డు దుస్థితి

జగదాంబ కూడలి, మే 17: కేజీహెచ్ పోలీస్ క్వార్టర్స్ నుంచి లేపాక్షి మెయిన్ రోడ్డుకు కలిపే కుమ్మరవీధి రహదారి పూర్తిగా గోతులతో అ ధ్వానంగా మారింది. ఈ మార్గంలో నిత్యం స్కూల్ ఆటోలు, సాలిపేట, జెం డాజెట్టు , పోలీస్ క్వార్టర్స్, కేజీహెచ్‌కు టూవీలర్స్.. లేపాక్షి మెయిన్ రోడ్డు నుం చి ప్రయాణిస్తుంటాయి. గత పదేళ్లుగా ఈ రహదారి నిర్మాణంపై పాల కులు శ్రద్ధ తీసుకోకపోవడం పట్ల స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ మార్గంలో నిత్యం జీవీఎంసీ వాహనాల రాకపోకలు జరుగుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం పలు విమర్శలకు దారితీస్తోంది. అలాగే, వన్‌టౌన్‌లోని పలు వీధుల్లో రహదారులు అధ్వానస్థితికి చేరాయి. చాలా ఏళ్లు అభివృద్ధికి నోచుకోకపోవడంతో గోతులతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా అధికార పార్టీ నాయకులు నిర్లక్ష్యం వహించ డంతో ఈ పరిస్థితి నెలకొంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాద కర మారిన ఈ రహదారుల అభివృద్ధికి జీవీఎంసీ అధికారులు చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు.



విశాఖ ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేస్తున్న బర్మా క్యాంపు ఘటనలో గాయపడిన ధనలక్ష్మి కుటుంబ సభ్యులు

- వివరాలు మెయిన్ ఎడిషన్‌లో

చెస్‌లో ఫల్గుణికి ఫిడే ఆర్బిటర్ టైటిల్



ఫల్గుణి

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 17: అంతర్జాతీయ చెస్ రంగంలో నగరానికి చెందిన మూగి ఫల్గుణి అరుదైన ఘనత సాధించింది. ప్రతిష్ఠాత్మక ఫిడే ఇంటర్నేషనల్ ఆ ర్బిటర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ టైటిల్‌కు సంబం ధించి బుడాపెస్ట్‌లో జరిగిన వెజెర్‌కెప్జో టోర్నీ, హంగేరిలో జరిగిన రిగో జానోస్ గ్రాండ్ మాస్టర్స్ బాలాటన్ టోర్నీ, ఆంధ్రలో జరిగిన ఫిడే రాపిడ్ చాంపియన్‌షిప్ తదితర వరుస అంతర్జాతీయ, జాతీయ టోర్నీ ల్లో ప్రాతినిధ్యం వహించింది. చివరగా ఇటీవల ఫిలిప్పిన్స్ చెస్ ఫెడరేషన్ నిర్వహించిన ఫిడే ఆర్బిటర్స్ సెమినార్‌లో పాల్గొన్న ఆమె అద్భుతమైన ప్రతిభ కనబరిచింది. దీంతో ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ ఫల్గుణికి ఫిడే ఇంటర్నేషనల్ టైటిల్‌ను ధ్రువపత్రా న్ని అందజేసింది. కాగా, ఇంటర్నేషనల్ ఫిడే ఆర్బిటర్ టైటిల్ సాధించిన తొలి ఆంధ్ర క్రీడాకారిణిగా ఫల్గుణి రికార్డు నెలకొల్పింది. ఈసందర్భంగా ఫల్గుణితోపాటు ఆమెను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను చెస్ మేధావులు, నిపుణులు అభినందించారు.

గంగవరం పోర్టులో సమ్మె విరమణ

... 5వ పేజీ తరువాయి

వారితోనూ వేరే గదిలో చర్చలు జరిపారు. త్వరలో వేతనాలు కొద్దిగా పెంచడా నికి, వారి కుటుంబాలకు వైద్య సదుపాయం కల్పించడానికి యాజమాన్యం అంగీక రించినట్టు సమాచారం. దాంతో వారంతా శుక్రవారం విధులకు హాజరయ్యారు.

వివరాలు వెల్లడించని యంత్రాంగం

అదానీ గంగవరం పోర్టులో ఎప్పుడు చర్చలు జరిగినా వాటి వివరాలు బయట పెట్టే సంప్రదాయం లేదు. వాటిని అమలు చేయాల్సిందిగా కార్మికులు ఒత్తిడి తెస్తా రని ఇంతవరకూ ఎప్పుడూ అలా చేయలేదు. తాజాగా జరిగిన చర్చల్లోను అదే వి ధానం అనుసరించారు. ప్రభుత్వ కార్యాలయంలో అధికారుల సమక్షంలో చర్చలు జ రిగినా వాటిని పత్రికలకు విడుదల చేయలేదు. ఇటు అధికారులు ముందుకురాలే దు. అటు పోర్టు యాజమాన్యం చొరవ తీసుకోలేదు. దీంతో ఈ ఒప్పందాన్ని అదానీ యాజమాన్యం పూర్తిగా అమలు చేస్తుందా?, లేదా?...అనే అనుమానాలు ఉన్నాయి. చర్చల్లో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులు కూడా పొడిపొడిగా చర్చలు వివరాలు వెల్లడించారే తప్ప అన్నీ చెప్పలేదు. వారైనా విలేకరుల సమావేశం నిర్వహించి, చ ర్చల సారాంశం చెప్పి ఉంటే బాగుండేది.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన సీఎండీ

ఉక్కుటౌన్‌షిప్ : పోర్టు నుంచి బొగ్గు సరఫరా కావడానికి సహకరించినందుకు ఉక్కు మంత్రిత్వ శాఖకు జిల్లా యంత్రాంగానికి, కార్మిక నాయకులకు, పోర్టు కార్మికు లకు ఉక్కు కర్మాగారం సీఎండీ అతుల్ భట్ కృతజ్ఞతలు తెలిపారు. ఇక ఉక్కు ఉత్పత్తిపై దృష్టిసారిస్తామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్‌ను (06508) ఈనెల 27 నుంచి జూన్ 17 వరకు, బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్‌ను (06585) ఈనెల 31 నుంచి జూన్ 14 వరకు, హౌరా-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (06586) జూన్ ఒకటి నుంచి జూన్ 15 వరకు, ఎస్ఎంవీ బెంగళూరు-గుహవటి ఎక్స్‌ప్రెస్‌ను (06569) ఈనెల 26 నుంచి జూన్ తొమ్మిది వ రకు, గుహవటి–ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (06570) ఈనెల 29 నుంచి జూన్ 12 వరకూ పొడిగించామని పేర్కొన్నారు. కాగా ఎస్ఎంవీ బెంగళూరు-మల్దా టౌన్‌ఎక్స్‌ప్రెస్ (06563) జూన్ 6న (ఆదివారం), మల్దా టౌన్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (06564) జూన్ 12న (బుధవారం), మైసూరు-ముజాఫర్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (06221) జూన్ 10న (సోమవారం), ముజాఫర్‌పూర్-మైసూరు ఎక్స్‌ప్రెస్ (06222) జూన్ 13న (గురువారం) అందుబాటులో ఉంటాయని తెలిపారు.

భువనేశ్వర్ నుంచి షోలాపూర్, ముంబైలకు ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా భువనేశ్వర్ నుంచి షోలాపూర్, ముంబై స్టేషన్లకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని, అయితే ఈ రైళ్లు ఒకవైపు మాత్రమే నడవనున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 01452 నంబరు గల రైలు ఈనెల 20న (సోమవారం) ఉదయం 4.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి 11.43 గంటలకు దువ్వాడ చేరుతుంది. ఇక్కడ నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 7.00 గంటలకు షోలాపూర్ చేరు తుంది. 01056 నంబరు గల రైలు ఈనెల 20న (సోమవారం) రాత్రి 11.00 గంట లకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 6.45 గంటలకు దువ్వాడ చేరుతుంది. ఇక్కడ నుంచి బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ముంబై వెళుతుంది.

ఎక్సైజ్ చేతివాటం

... 5వ పేజీ తరువాయి

లేనప్పటికీ, బార్ల నిర్వాహకులకు మాత్రం భారీగా సంపాదించారని చెబుతు న్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు

- వి.సుధీర్, డిపో మేనేజర్

ఎన్నికల సీజన్‌లో బార్‌లకు అదనపు మద్యం కేటాయింపులు జరిగాయనే ఆరోప ణల్లో వాస్తవం లేదు. ఎన్నికల సంఘం ఆదేశాలతోపాటు ఎక్సైజ్ శాఖ నిబంధనలు ప్రకారమే కేటాయింపులు చేశాం. బార్‌లకు అదనపు కేటాయింపులు చేసి, వారి నుంచి బాక్స్‌కు రూ.వంద చొప్పున మామూళ్లు తీసుకున్నారనడం పూర్తిగా అవాస్తవం. కేటాయింపులకు సంబంధించిన గణాంకాలన్నీ పక్కాగా నమోదుచేశాం. అనుమానం ఉన్నవారెవరైనా వాటిని అడిగితే అందజేస్తాం.

రైతుబజార్లలో అడ్డగోలుగా పండ్ల దుకాణాలు

... 5వ పేజీ తరువాయి

గతంలో ఎప్పుడూ లేదు. ఈసారే అలా చేశారు.

ఇబ్బందులు లేవని ఈఓలతో లేఖలు

నగరంలోని రైతుబజార్లు వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయని 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ఒక కథనం ప్రచురించగా, మార్కెటింగ్ శాఖాధికారులు ఎస్టేట్ అధికా రులను గోపాలపట్నం ఆఫీసుకు పిలిపించుకొని మాట్లాడారు. పలాస జీడిపప్పు, అ నంతపురం వేరుశెనగలు, దుగ్గిరాల పసుపు, గుంటూరు కారం విక్రయించడం వల్ల మీకు ఇబ్బందులు ఉంటే రాసివ్వాలని ఒత్తిడి పెట్టారు. అలాంటిదేమీ లేకపోతే 'ఇ బ్బంది లేదు' అని రాసివ్వాలని చెప్పి ఆ మేరకు లేఖలు తీసుకున్నారు. ఇదిలా ఉం టే రైతుబజార్లలో ఏ సరకునైనా బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే అ మ్మాల్సి ఉండగా ఎక్కువకు అమ్ముతున్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖాధికారులు ఏమీ మాట్లాడడం లేదు. పైగా ఆ సరకులను ప్యాకింగ్ చేయడానికి, గోపాలపట్నం నుంచి బజార్లకు తీసుకువెళ్లడానికి వ్యయం కూడా బజార్ల సిబ్బందే పెట్టుకోవాలని చెబుతున్నారు. ఎవరైనా ఖర్చులు అని అడిగితే.. 'మీది తుమ్మితే ఊడిపోయే ఉద్యో గం' అది గుర్తు పెట్టుకొని పనిచేయండి అంటూ బెదిరిస్తున్నట్టు తెలిసింది. వీట న్నింటిపై జాయింట్ కలెక్టర్ సరైన విచారణ చేసి, తగిన చర్యలు తీసుకోవలసి ఉం ది.

స్ట్రాంగ్‌రూమ్‌లకు మూడంచెల భద్రత

... 5వ పేజీ తరువాయి

తీశారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపరిచిన గదులకు వేసిన సీళ్లను పరిశీలించారు. పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున అక్కడ లాగ్ బుక్‌లో సంతకం చేశారు.


ప్రత్యేక అలంకరణలో మరిడిమాంబ అమ్మవారు

ఘనంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, మే 17: లంకెలపాలెం, పరిసర ప్రాంత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ ఆలయ 31వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారిని పురోహితులు నూతనవస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం పూజలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కోలాటాలు, చిడత భజనలు ఆకట్టుకున్నాయి. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయంలో పూజలు

స్థానిక దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలితా, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ చిత్తా గణేశ్, చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

అగనంపూడి, మే 17: అనారోగ్యంతో మృతి చెందిన లారీ డ్రైవర్ గల్లా త్రినాథ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు స్థానిక సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ముందుకువచ్చింది. ఈమేరకు శుక్రవారం దానబోయినలో నివాసముంటున్న మృతిని భార్య, కుటుంబ సభ్యులకు కలిసి నెలకు సరిపడా రేషన్ సరకులను అందజేశారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పట్టా రామఅప్పారావు, లక్కరాజు రాము, బొండా ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో రక్తపోటు నివారణ

అక్కిరెడ్డిపాలెం, మే 17: నిత్యం వ్యాయామం, మంచి ఆహార అలవాట్లతోపాటు వ్యసనాలకు దూరంగా ఉండడం ద్వారా అధిక రక్తపోటును నియంత్రించవచ్చని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ కె.నారాయణరాజు అన్నారు. అంతర్జాతీయ రక్తపోటు నివారణ దినం సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత యాంత్రికకాలంలో మారిన ప్రజల జీవన శైలితో అధికశాతం మంది రక్తపోటుతోపాటు గుండె వ్యాధులకు గురవుతున్నారన్నారు. బీపీతో బాధపడుతున్నవారు తమ జీవన శైలిలో మార్పులు చేసుకోవడంతోపాటు వైద్యులను సంప్రదించి ప్రణాళికా బద్ధంగా మందులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బందితో పాటు స్థానికులు పాల్గొన్నారు.

తడి- పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి

కూర్మన్నపాలెం, మే 17: నివాసితులు తడి- పొడి చెత్తవేరుచేసి ప్రతిరోజూ జీవీఎంసీ సిబ్బందికి అందించాలని తిరుమలనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకుడు జి.విశ్వేశ్వరరావు కోరారు. ఏకో వైజాగ్‌లో భాగంగా శుక్రవారం 87వ వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి సంరక్షణ, సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు జాగ్రత్తలు, ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వాడక నిషేధం తదితర అంశాలపై పాటించాల్సిన నియమాలపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు నాగభూషణం, పరమానందం, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 25,వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 30, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 34, బీరకాయలు 46,ఆనపకాయ 24,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 28, దొండకాయలు 27, బంగాళదుంపలు 27, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 146, బరబాటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 185, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 40, కీరదోస 26, కాప్సికమ్ 56, పొట్లకాయ 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	138
ఫారం ధర	158
విత్ స్కిన్	286
స్కిన్‌లెస్	296

మండుటెండలో ప్రయాణికుల అగచాట్లు

- పాతగాజువాక జంక్షన్‌లో బస్‌షెల్టర్ లేక ఇక్కట్లు

గాజువాక, మే 17: గాజువాక ప్రాంతంలో నిత్యం రద్దీగా ఉండే పాతగాజువాక జంక్షన్ అనకాపల్లి మార్గంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మండుటెండలో పిల్లాపాపలతో బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. పాతగాజువాక కేంద్రంగా స్టీల్‌ప్లాంట్, పరవాడ, అనకాపల్లి, తదితర ప్రాంతాలకు వెళ్లేవారు, వివిధ కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు ఈ బస్‌స్టాప్ నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ బస్టాప్‌లో ఆరేళ్ల క్రితం నాలుగుషెల్టర్‌లు ఏర్పాటు చేశారు. అక్కడున్న వ్యాపార సంస్థలకు అడ్డంగా ఉన్నాయని, వీటిని రాత్రికి రాత్రే తొలగించారు. అయినా, ఆర్టీసీ, జీవీఎంసీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. భారీ మొత్తంలో ముడుపులు చేతులు మారడంతోనే వీరు మిన్నకుండిపోయినట్టు ఆరోపణలున్నాయి. పాతగాజువాక జంక్షన్ వద్ద సింధియా వైపు వెళ్లే మార్గంలోని బస్ షెల్టర్‌ను కూడా తొలగించడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని స్థానిక కళాశాల విద్యార్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా, నేటి వరకు పట్టించుకోలేదు. దీంతో ప్రయాణికులు ఎండా, వానలో బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా, పారిశ్రామిక ప్రాంతంలో కీలక జంక్షన్లలో బస్ షెల్టర్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదించారు. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పాతగాజువాకలో ఎండలో ప్రయాణికులు


ఎండ ప్రభావంతో ఖాళీగా పెందుర్తి కూడలి

దారెత్తిస్తున్న ఎండలు

పెందుర్తి: వేసవి దారెత్తిస్తోంది. రెండు రోజులు చిరుజల్లులతో ఊరట చెందిన ప్రజలు శుక్రవారం ఎండ ధాటికి అల్లాడారు. మధ్యాహ్న సమయంలో వీచిన వేడిగాలులతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీనికి తోడు ఉక్కబోతతో విలవిల్లాడారు. భానుడి ప్రతాపంతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. వృద్ధులు, చిన్నారులు ఎండ వేడికి అల్లాడుతున్నారు. చినముషిడివాడ, పెందుర్తి బీఆర్టీఎస్ రోడ్డులో జనసంచారం కనిపించలేదు. మరోవైపు వేసవి తీవ్రతతో మధ్యాహ్నం యజమానులు దుకాణాలను మూసివేస్తున్నారు.

జీతాలు చెల్లించాలని ఉక్కు ఉద్యోగుల ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, మే 16: స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులకు తక్షణమే జీతాలు ఇవ్వాలని సీటీయూ గౌరవధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈడీ (వర్క్స్) కార్యాలయం ఎదుట శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో కష్టించి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఉత్పత్తి తీసేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉందని, కానీ యాజమాన్యం అందుకు సరిపడే వనరులు సమకూర్చలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులను ఇబ్బందులు పెట్టే చర్యలను యాజమాన్యం మానుకోవాలని ఆయన హితవు పలికారు. కేవలం ఉద్యోగుల జీతాలు రూ. 90 కోట్లు చెల్లించడంలో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. యాజమాన్యం తమ వైఖరి మార్చుకోవాలన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) స్తోభితో సమావేశమై సమస్యలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, వైటి.దాసు, సురేష్‌బాబు, సన్యాసిరావు, అప్పారావు, మరిడయ్య, నీలకంఠం, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సీజీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



రిలే దీక్షలో కూర్చున్న ఉక్కు ఉద్యోగులు

తక్షణమే వేతనాలు చెల్లించాలి

కూర్మన్నపాలెం: ఉక్కు ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1191వ రోజు చేరాయి. ఈ దీక్షల శిబిరంలో పాల్గొన్న కార్మికులనుద్దేశించి రామస్వామి మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం ఈ నెల 17 వచ్చినా నేటి వరకూ కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదన్నారు. కార్మిక సంఘాలన్నీ సమష్టిగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల విక్రయం దేశ మనుగడకు చేటన్నారు. ప్రభుత్వ రంగాలను కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టాలని చూస్తే కేంద్ర ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేయడం ఖాయమని హెచ్చరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు ఫ్యాక్టరీలో ఉత్పత్తి పెంచాలని, ఉద్యోగులకు సత్వరమే జీతాలు మంజూరు చేయాలని కోరారు. ప్రజా పోరాటాలతో ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పాడైన తాగునీటి పైప్‌లైన్లతో అవస్థలు

- శివారు ప్రాంతాలకు అందని నీరు
- పారిశ్రామికప్రాంతంలో అవస్థలు

మల్కాపురం, మే 17: పారిశ్రామిక ప్రాంతంలో భూగర్భంలో జీవీఎంసీ పైప్‌లైన్‌లీక్‌లతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలంచెల్లిన పైప్‌లు కావడంతో ప్రతిరోజూ ఏదోచోట మంచినీటి సరఫరా నిలిచిపోతోంది. ఇటీవల మల్కాపురం ఎస్సీ కాలనీలో దాదాపుగా వారం రోజులపాటు నీటి సరఫరా బంద్ అయింది. ఈనేపథ్యంలో అధి కారులు ఎంత శ్రమపడినా, ఈ సమస్యను గుర్తించలేక..మరో మార్గం ద్వారా ఈకాలనీకి తాగునీటిని సరఫరా చేయాల్సి వచ్చింది. ఇప్పటికీ కూ డా ఈ సమస్యను గుర్తించలేకపోయారు. ప్రస్తుతం ఎక్కడిక్కడ శిథిలావస్థకు చేరుకున్న పైప్‌లైన్లు భూగర్భంలోనే నీరు లీకై బయటకు రాలేకపోతుంది.

ఈ ప్రాంతంలో సంబంధిత కాంట్రాక్టర్‌కు ఎప్పటికప్పుడు రోజు ఏదో చోట పైప్‌లైన్ రంధ్రాలు పడడడంతో ఈ సమస్య పరిష్కరించడం తలకుమించిన భారమవుతోంది. జీవీఎంసీ ఉద్యోగులు ఈ సమస్యపై అంతమాత్రంగానే దృష్టిసారిస్తున్నారు. సమస్యను గుర్తించేందుకే రోజుల సమయం తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. అవసరమైన చోట మంచినీటి ట్యాంక్‌లు కూడా పంపడం లేదు. వార్డుల్లో తమకు సమీపంలోని బోర్లు ఇతర వాటిపై ఆధారపడాల్సివస్తోంది. ఆ నీరు తాగడానికి కానీ, వంటకు గానీ ఉపయోగించలేని పరిస్థితి. ఇళ్లలో వాడక అవసరాల నిమిత్తం మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఈ సమస్యలను పరిగణలోకి తీసుకుని పారిశ్రామిక ప్రాంతంలో భూగర్భంలోని పైప్‌లైన్‌ను పూర్తి స్థాయిలో మార్పుచేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పైప్‌లైన్ పాడవడంతో కొళాయి నుంచి సన్నని ధారగా వస్తున్న తాగునీరు

ఉక్కు ఆస్పత్రికి వాటర్ ప్యూరిఫైయర్ వితరణ

ఉక్కుటౌన్‌షిప్, మే 17: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రికి ఉక్కు సీనియర్ మేనేజర్ కె.ప్రసాద్ వాటర్ ప్యూరిఫైయర్ వితరణగా అందజేశారు. ఆస్పత్రిలో శుక్రవారం సీజీఎం కెహెచ్.ప్రకాష్‌కు దీనిని అందించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయాలనే సంకల్పంతో దీనిని అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సారంగి, నవీన్‌కుమార్, కమిటీ మునినాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.


సీజీఎంకు వ్యాటర్ ప్యూరిఫైయర్ అందిస్తున్న దృశ్యం

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆటోనగర్, మే 17: ఆటోనగర్ నుంచి షీలానగర్ వెళ్తున్న కాంక్రీట్ లారీ, గాజువాక నుంచి విశాఖ నగరానికి అల్యూమినియం బస్తాలతో వస్తున్న ట్రాలర్ లారీ శుక్రవారం సాయంత్రం ఆటోనగర్ కూడలి వద్ద ఢీ కొన్నాయి. దీంతో లారీ అద్దాలు పగిలిపోయాయి. డివైడర్‌పైకి దూసుకు పోవడంతో లారీలో ఉన్న బస్తాలు చిందరవందరగా పడిపోయాయి. దీంతో కూడలిలో సుమారు 45 నిమిషాలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు వాహనాలను సర్వీస్ రోడ్డు గుండా తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వాహనాలు ఢీకొన్న సమయంలో పాదచారులు గానీ, వాహనాలు రాక పోవటంతో పెను ప్రమాదం తప్పింది.


ఢీకొన్న వాహనాలు


విరిగిపోయిన ఉయ్యాల


రైల్వే క్వార్టర్స్‌లో మరమ్మతులకు గురైన ఆట వస్తువులు

ఆహ్లాదానికి దూరం... పరిసరాలు అధ్వానం

- జీవీఎంసీ 86, 87 వార్డుల పరిధిలో అధ్వానంగా పార్కులు
- పట్టించుకోని అధికారులు

కూర్మన్నపాలెం, మే 17: జీవీఎంసీ 86, 87 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లోని పార్కులు ఆహ్లాదానికి దూరంగా అస్తవ్యస్తంగా మారాయి. సేద తీరేందుకు ఉపయోగపడాల్సిన పార్కు స్థలాలు కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి పాముల బెడద అధికవు ్ంది. యాంత్రికమైన నగర జీవనంలో కాస్త విశ్రాంతి తీసుకుందామని వస్తున్న వృద్ధులు, చిన్నారులు పార్కుల్లో అడుగుపెట్టాలంటే భయాందోళన చెందుతున్నారు. పార్కుల్లో పెద్దపెద్ద ముళ్ల కంచెలు పెరగడంతో పరిసర ప్రాంత ప్రజలు భీతిల్లుతున్నారు. కొన్ని పార్కులను స్థానికులు పశువుల స్థావరాలుగా వినియోగించుకుంటున్నారు. పిల్లల ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు కూడా శిథిలావస్థకు చేరాయి. పార్కుల్లో కూర్చునేందుకు అవకాశం లేకుండాపోతోంది. పార్కులు అభివృద్ధి చేయాలని అధికారులకు విన్నవించినా ఫలితం కనిపించలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ పాలకులు, అధికారులు స్పందించి పార్కులను వినియోగంలోకి వచ్చేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- ప్రాంతీయ అగ్నిమాపక అధికారి డి.నిరంజన్‌రెడ్డి

విశాఖపట్నం, మే 17: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగిన భద్రతా చర్యలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి డి.నిరంజన్‌రెడ్డి కోరారు. ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ చాప్టర్ నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా హోటల్ దసపల్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదాలకు సంబంధించిన సమాచారం ఎప్పుడూ 20 నుంచి 30 నిమిషాల తరువాతే సంబంధిత శాఖకు చేరుతోందని, అయితే కేవలం రెండు నిమిషాల్లో సమాచారం ఇచ్చే అవకాశం ఉందన్నారు. దీనివల్ల ప్రమాద తీవ్రతను తగ్గించడంతో పాటు సత్వరమే అదుపులోకి తీసుకువచ్చే అవకాశముందన్నారు. ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు వి.శ్రీనివాస్ విశాఖ చాప్టర్ నూతన అధ్యక్షుడిగా ఆర్.రామకృష్ణారావు, కార్యదర్శిగా కె.కుమార్‌రాజు ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎస్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎస్ దాస్, ఎఫ్ఎస్ఏఐ రీజనల్ డైరెక్టర్ ఎస్.ప్రసాదరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రావణి షిప్పింగ్‌లో అత్యుత్తమ ఫైర్ సెఫ్టీ అమలు చేస్తున్నందుకు సంస్థ అధినేత డాక్టర్ జిసాంబశివరావుకు అవార్డు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వెంకన్నకు వైభవంగా లక్ష తులసి అర్చన

పెందుర్తి, మే 17: స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం వెంకటేశ్వరుడికి లక్ష తులసి, మల్లెల పుష్పార్చన పూజ నేత్రపర్వంగా నిర్వహించారు. వెంకన్న విగ్రహానికి తులసి మాలలు వేశారు. లక్ష తులసి పత్రి, మల్లెలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు ధ్వజారోహణ. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష అర్చన అనంతరం హారతులిచ్చారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


స్వామికి లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్


చినముషిడివాడ కేంద్రం వద్ద అభ్యర్థులు

పెందుర్తి, మే 17: ఏపీ ఈఏపీసెట్ శుక్రవారం చినముషిడివాడ, సుజాత నగర్‌లోని ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. రెండు రోజులుగా ఉదయం, మధ్యాహ్నం షిఫ్టులలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పరీక్షలకు సుమారు రెండు వేల మంది విద్యార్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

పగటిపూటా హైమాస్ట్ దీపాలు

ఎన్ఏడీ జంక్షన్, మే 17: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్ సామాజిక భవనం ఎదురుగా మూడురోజులుగా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. హైమాస్ట్ దీపాలతో పాటు శివారులోని 20 విద్యుత్తు స్తంభాలపై వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతునే ఉన్నాయి. ఎన్నికల అనంతరం అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే దీపాలు ఆర్పడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సుమారు 50 రోజులుగా విద్యుత్తు వృథా జరుగుతోంది. ఇక్కడి కాలనీలో తరచూ ఇదేవిధంగా రేయింబవళ్లు వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయని, విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీధి దీపాల నిర్వహణపై అనేక మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


విమాన్‌నగర్‌లో పగలే వెలుగుతున్న హైమాస్ట్ దీపాలు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


వేపగుంటలో కూడలిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వేపగుంట మే 17: వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. వేపగుంట కూడలిలో శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాలవేసి పూజలు చేశారు. దీపారాధన అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు వాయిదా

పాడేరు, మే 17 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు వాయిదా పడ్డాయి. ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవాలను జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది. సార్వత్రిక ఎన్నికల తరువాత రాష్ట్రంలో ప్రధానంగా పల్నాడు జిల్లాలో జరిగిన హింస, అవాంఛనీయ ఘటనల నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు అనుమతులు ఇవ్వలేమని కలెక్టర్ ఎం.విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం తేల్చి చెప్పారు. ఒక వేళ ఉత్సవాలను నిర్వహించుకోవాలనుకుంటే, ఎటువంటి హడావిడి లేకుండా కేవలం ఆలయంలో అమ్మవారికి పూజలతోనే సరిపెట్టాలని సూచించారు. దీంతో ఉత్సవాలను నిర్వహించలేమని, తాజా ఘటనల నేపథ్యంలో ఉత్సవాలను వాయిదా వేసి జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతిధులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

మల్కాపురం, మే 17: షిప్‌యార్డు న్యూకాలనీ సమీపంలో గల ఏకేసీ కాలనీ జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో షిప్‌యార్డు సొసైటీ మాజీ ఉద్యోగి ఎండీ హుస్సేన్ (45) మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డారు. సింధియా నుంచి మల్కాపురం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా న్యూకాలనీ జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఆవు అడ్డంగా రావడంతో దానిని ఢీకొని రోడ్డుపై తుళ్లిపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా హుస్సేన్ మృతి చెందాడు. వెంకటరమణ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. మృతుడు హుస్సేన్ గాజువాక చెందిన వాడు కాగా, వెంకటరమణది మల్కా పురం. మల్కాపురం పోలీసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


హుస్సేన్ (ఫైల్)

స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలు

ఉక్కుటౌన్‌షిప్, మే 17: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్ విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న జి.సాంబయ్య (55) ప్రమాదవశాత్తు పిట్ (వేడి నీరు ఉండే ప్రాంతం)లో పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలావున్నాయి....పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన సాంబయ్య శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా విభాగంలో 30అడుగుల కిం దకు దిగి పిట్‌లో నీటి (60డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన నీరు)ని పరిశీలిస్తున్నాడు. ఆ సమయంలో పిట్‌లో నీరు ఆరడుగులుంది. ప్రమాదవశాత్తు అందులో పడిపోవడంతో శరీరం కాలిపోయింది. విధుల్లోని ఉద్యోగులు హుటాహుటిన ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఒలుపు చందనం విక్రయాలకు బ్రేక్

సింహాచలం, మే 17: వరాహలక్ష్మీనృసింహస్వామి ఒలుపు చందనం విక్రయాలను శనివారం నిలుపుదల చేస్తున్నట్టు దేవాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19, 20, 21 తేదీల నుంచి మళ్లీ విక్ర యాలు కొనసాగుతాయని చెప్పారు. ఈనెల 16 నుంచి ప్రారంభమైన ఒలుపు చందనం విక్రయాలు శుక్రవారం కూడా కొనసాగాయి. రెండవ రోజు చందనం ప్రసాదాల కొనుగోలుకు ఉత్తరాంధ్ర నలుమూలలు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సూర్యోదయం నుండే క్యూలో బారులు తీరారు. ఒకదశలో క్యూ ప్రసాదాల విక్రయాల కేంద్రం నుంచి సుమారు వంద మీటర్ల దూరంలో ఉన్న నిత్యాన్న ప్రసాద భవనం వరకు కనిపించింది. దేవాలయ ఏఈఓ ఎన్. ఆనంద కుమార్ విక్రయాల కౌంటర్ వద్ద స్వయంగా ఉండి పర్యవేక్షిస్తూ వెయ్యి పేకెట్ల వరకూ విక్రయించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



అమ్మవారికి క్షీరాభిషేక దృశ్యం

పూర్ణామార్కెట్, మే 17: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక పూజలను నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారిని అలంకరించిన అర్చకులు 12 మంది ఉభయదాతలతో ఈ పూజలు చేయించారు. ప్రతీ శుక్రవారం ఆలయంలో నిర్వహించే ఈ క్షీరాభిషేక సేవల్లో రూ.500 టికెట్ రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని ఈవో శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు



సీఐ విజయ్‌కుమార్‌కి బీపీ చెక్‌చేస్తున్న వైద్యురాలు

సీతంపేట, మే 17: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో అధికారులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ హేమ సీఐ విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు.ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సీపీ ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు చేయించినట్లు సీఐ విజయ్‌కుమార్ వివరించారు.

దివ్యాంగ యువతకు ఐటీఐలో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కంచరపాలెం/ కొమ్మాది, మే 17 : ఐటీఐ పలు ట్రేడుల్లో 2024- 25 విద్యా సంవత్సరానికి శిక్షణ పొందేందుకు పురుష దివ్యాంగులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు విశాఖ జిల్లా దివ్యాంగుల కార్పొరేషన్ ప్రాజెక్టు అధికారి పి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. బక్కన్నపాలెంలోని సంస్థ కార్యాలయంలో ఈశిక్షణను అందించనున్నారు. ఐటీఐలో కార్పెంటర్ 24, షీట్‌మెటల్ వర్కర్ 20, వెల్డర్ 20, పెయింటర్ 20 సీట్లలో శిక్షణను ఏడాది పాటు అందించనున్నారు. పదో తరగతి పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఐటీఐ వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవాలని సూచించారు. దరఖాస్తు గడువుజూన్ 10వ తేదీ వరకు ఉంది. మొదటి విడత కౌన్సెలింగ్ జూన్ 1న నిర్వహిస్తామన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం బక్కన్నపాలెం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో టీడీపీ ముందంజ

మహారాణిపేట, మే 17:ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రజలను ఆకట్టుకున్నట్టు ఫోర్ పాయింట్స్ టెక్నాలజీస్ సంస్థ అధినేత శివ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఒక సమావేశం మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అత్యున్నత సాంకేతికత పరిజ్ఞానం అగ్మెంటెడ్ రియాలిటీతో ప్రచారం చేశారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల ప్రయోజనాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లారన్నారు.

నిలకడగా కేజీహెచ్ సూపరింటెండెంట్ ఆరోగ్యం

విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): గుండె పోటుకు గురైన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. బుధవారం విధుల్లో ఉండగా గుండెపోటుకు గురైన ఆయనకు అత్యవసరంగా కేజీహెచ్‌లోనే పేస్‌మేకర్ వేశారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శుక్రవారం ఉదయం పర్మినెంట్ పేస్‌మేకర్ వేసినట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ వ్యవహరిస్తున్నారు.

ఇగ్నోలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీ కాలనీ, మే 17 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దూర విద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ ధర్మారావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో వెబ్‌సైట్‌లోని అడ్మిషన్ లింకు ద్వారా ప్రవేశాలు పొందవచ్చునన్నారు. అన్ని కోర్సుల్లోనూ ప్రవేశాలకు దరఖాస్తు గడువు జూన్ 30 అని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 0891 2511200ను సంప్రతించాలని ఆయన సూచించారు.





సిటీ సెంట్రల్ పార్కు ద్వారానికి ఆనుకుని పదుల సంఖ్యలో ప్రైవేట్ బస్సులు పార్కింగ్

ట్రావెల్స్ బస్సులు పార్కింగ్‌తో రాకపోకలకు అవస్థలు

- సిటీ సెంట్రల్ పార్కు వెళ్లే మార్గంలో ఆక్రమణ
- పట్టించుకోని పోలీసులు

డాబాగార్డెన్స్, మే 17: జీవీఎంసీ 31వ వార్డులోని సిటీ సెంట్రల్ పార్కు వెళ్లే మార్గంలో రహదారిపైనే ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సులను ఇష్టానుసారంగా పదుల సంఖ్యలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఉదయం, రాత్రి వేళల్లో వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుకు సగానికిపైగా ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సులు నిండిపోయి ఉండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఇవన్నీ కళ్లముందే కనిపిస్తున్నా ట్రాఫిక్ పోలీసులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంపై సానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డుపై కొద్దిసేపు ద్విచక్రవాహనాన్ని ఆపితేనే హడావుడి చేసే పోలీసులు ప్రైవేటు బస్సుల జోలికి వెళ్లడం లేదు. వారి నుంచి నిత్యం మామూళ్లు అందుతుండడమే దీనికి కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎదురుగా సిటీ సెంట్రల్ పార్కు వద్దనున్న ఫుడ్‌కోర్టుతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఫుడ్‌కోర్టుకు సాయంత్రం సమయంలో వెళ్లాలంటే అంబేడ్కర్ సర్కిల్ వద్ద భారీ సంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో పాటు అంబేడ్కర్ సర్కిల్ నుంచి రెడ్నంగార్డెన్స్ వెళ్లే డివైడర్ దాటే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రావెల్స్ బస్సుల పార్కింగ్‌ను అడ్డుకోవాలని, స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మద్యం సీసాతో దాడి

మర్రిపాలెం, మే 17: మద్యం బాటిల్‌తో వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు అందించిన వివరాలివి.. మాధవధార గాంధీనగర్ మహత్ కాలనీలో ఆటో డ్రైవర్ చిన్నిసంతోష్‌కుమార్ భార్య ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. గురువారం టిఫిన్ తీసుకువచ్చి ఇంట్లో ఇచ్చి అదే కాలనీలో ఉంటున్న స్నేహితుడు వాసుతో కలిసి బయటికి వెళ్లి మద్యం సేవించి తిరిగివచ్చారు. అదేసమయంలో సంతోష్‌కుమార్ తండ్రికి మేనల్లుడు అయిన మహేష్ తనతో తెచ్చుకున్న మద్యం బాటిల్‌తో పొడిచేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పగిలిన గాజుసీసా తగిలి సంతోష్‌కుమార్ ఎడమ కుడి కంటినుంచి దవడ వరకు చీరుకుపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్పందించిన ఆయన అన్నయ్య ఎల్లాజీ సంతోష్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యులకు తనపై సంతోష్ కుమార్ తప్పుగా ప్రచారం చేస్తున్నాడనే కక్షతో దాడికి పాల్పడినట్లు నిందితుడు తెలిపినట్టు పోలీసులు చెబుతున్నారు. గాయపడిన వ్యక్తి ఫిర్యాదుపై సీఐ చక్రధరరావు నేతృత్వంలో కేసు నమోదు చేసి ఎస్సై వరలక్ష్మి దర్యాప్తు చేపడుతున్నారు.

నేడు ఎర్నిమాంబ తొలేళ్ల ఉత్సవం

జ్ఞానాపురం, మే 17: అల్లిపురం అచ్చియ్యమ్మపేటగ్రామస్తుల ఇలవేల్పు ఎర్నిమాంబ జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం తొలేళ్ల ఉత్సవం, ప్రధాన పండగ అదివారం నిర్వహించనున్నారు. 80 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన ఈ అమ్మవారు గ్రామస్థుల ఇలవేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చేతల్లిగా పేరొందారు. సంతానం లేని వారు అమ్మవారిని వేడుకుంటే పిల్లలు పుడతారని భక్తుల విశ్వాసం. ఈ క్రమంలో ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. గతంలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో దేవాలయం ఉండేది. అయితే, భక్తులు తాకిడి, ఆదాయం పెరగడంతో ఆలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేశారు. ఇటీవలే విశాఖ డెయిరీ ఆర్థిక సహాయంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. అప్పటి నుంచి ఈవో పర్యవేక్షణలో ఆలయం నడుస్తోంది. ఏటా మేనెల మూడో ఆదివారం అమ్మవారి పండగ నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం తొలేళ్లు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో సురేష్‌బాబా తెలిపారు. ఈ ఉత్సవం పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి నుంచి ప్రారంభమై కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట మీదుగా ఆలయం వరకు అమ్మవారి ప్రతిమల ఊరేగింపు జరగుతుంది. జాతర రోజు అమ్మవారిని పుష్పాలతో అలంకరిస్తామన్నారు. ఆరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ తెలిపారు.



అమ్మవారు

31వ వార్డులో స్వల్పంగా పెరిగిన ఓటింగ్


- 58.3 శాతం నమోదు.. గతసారి కంటే 4శాతం అధికం
- 17,622 ఓటర్లకు గాను 10,274 మంది ఓటు వేసిన వైనం....
- ఓటు హక్కు వినియోగానికి యువ ఓటర్లు ఆసక్తి



ప్రైమరీ స్కూల్‌లో క్యూ నిల్చున్న ఓటర్లు (ఫైల్‌ఫొటో)

డాబాగార్డెన్స్, మే 17: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని 58.3 పోలింగ్ శాతం నమోదైంది. వార్డులో మొత్తం 17622 ఓటర్లు ఉండగా, 10274 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వార్డు పరిధిలోని 54, 55, 56, 199, 200 నుంచి 215, 235 పోలింగ్ బూత్‌ల ద్వారా డాబాగార్డెన్స్, గొల్లల పాలెం, చాకలిపేట, సూర్యాబాగ్, లలితాకాలనీ తదితర కేంద్రాల్లోని ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. గత సారి కంటే పోల్చుకుంటే.. ఈసారి ఎన్నికల్లో నాలుగు శాతానికి పైగా ఓటింగ్ పెరిగింది. వృద్ధులు, యువత అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే మరికొంత మంది ఇతరత్రా ప్రాంతాలకు వెళ్లిపోవడం, కొందరు స్థానికంగా లేకపోవడంతో పోలింగ్ శాతంపై కొంత ప్రభావం పడింది. ఇదిలా ఉండగా ఎన్నికల ముందు ఓటర్ స్లిప్స్ ఉన్న వారికి వివిధ పార్టీలు ఓటుకు ఇంత చొప్పున డబ్బు పంపిణీ జరిగింది. కొందరికి స్లిప్‌లున్నా డబ్బు చెల్లించపోవడంతో నిరాశకు లోనయ్యారు. దీంతో వీరిలో కొందరు ఓటు వేసేందుకు వీరు పెద్దగా ఆసక్తి చూపలేదు. అలాగే, ఎండ ఓ వైపు..ఓటింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగడంతో మరికొంత మంది ఓటువేయకుండానే వెనక్కి వెళ్లిపోయారు. డాబాగార్డెన్స్‌లోని కొంతమేర వ్యాపార, వ్యాణిజ్య ప్రాంతం కావడంతో చాలా మందికి ఓట్లు ఉన్నా, పలువురు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. కొందరికి వేరే చోట ఉన్న వారి ఓట్లను తొలగించడంతో పూర్తిస్థాయిలో ఓటింగ్ కు వీలు కాలేదు.

మోతుగూడెంలో పుష్ప-2 షూటింగ్



సీలేరు నదిలో ఎర్రచదనం దుంగలు డంప్ చేసిన సన్నివేశం దృశ్యం

మోతుగూడెం, మే 17: చింతూరు మండలం మోతుగూడెంలో యర్ సీలేరు ప్రాజెక్టులో మంగంపాడు, పాలగడ్డ, డొంకరాయి, పొల్లూరు పరిసర ప్రాంతాల్లో వారం రోజులుగా చిత్రీకరించిన పుష్ప-2 సినిమా షూటింగ్ గురువారం ముగిసింది. సీలేరునదిలో దారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఎర్రచందనం దుంగలు సీలేరు నదిలో డంప్ చేసిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. శుక్రవారం జరిగిన కొన్ని సన్నివేశ చిత్రీకరణలో స్థానికులకు అవకాశం లభించడంతో ఆనందం వ్యక్తం చేశారు.

నేటినుంచి రాజస్థానీ ఫుడ్ ఫెస్టివల్

మహారాణిపేట, మే 17: సాగరతీరంలోని రాడిసన్ బ్లూ హోటల్ వేదికగా శనివారం నుంచి ఈనెల 25 వతేదీ వరకు రాజస్థాన్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్న ట్టు నిర్వాహకులు జీవీ రమేష్, రాజేష్ జోషి తెలిపారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాజ స్థాన్‌లో అత్యంత ప్రసిద్ధి చెందిన 70 రకాల రుచికరమైన వంటకాలను ఈ ప్రదర్శనలో ఉంచనున్నట్టు చెప్పారు. విశాఖవాసులు ఈ రుచులను ఆస్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బి కైలాష్ పాల్గొన్నారు.

వ్యక్తిగత కక్షలతోనే బర్మాక్యాంపులో దాడి

- డీసీపీ సత్తిబాబు



వివరాలను అడిగితెలుసుకుంటున్న డీసీపీ సత్తిబాబు, ఏసీపీ నరిశింహమూర్తి

కంచరపాలెం, మే 17: టీడీపీకి ఓటు వేయలేదనే నెపంతో బర్మాక్యాంప్‌లో లోకేష్ అనే వ్యక్తి జరిపిన దాడిలో గాయపడిన బాధితుల ఇళ్లను పశ్చిమ డీసీపీ మేక సత్తిబాబు, ఏసీపీ అన్నెం నరిశింహమూర్తి శుక్రవారం సందర్శించారు. బాధితులతో వారు మాట్లాడారు. జరిగిన ఘటనపై స్థానికులనుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుంకర నూకరత్నం ఆమె తల్లి ధనలక్ష్మితో పాటు మణికంఠపై లోకేష్ అనే వ్యక్తి దాడి చేసి గాయాలు చేసిన సంఘటన తెలిసిందే. ఈ సంఘటనపై రాజకీయ ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో డీసీపీ, ఏసీపీలు స్వయంగా వచ్చి విచారించారు. ధనలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు మద్యం సేవించి బుధవారం లోకేష్ ఇంటి వద్ద న్యూసెన్స్ చేశారని, ఈ నేపథ్యంలోనే లోకేష్ వారిపై దాడి చేసినట్టు స్థానికులను విచారించగా తెలిసిందని డీసీపీ పేర్కొన్నారు. వ్యక్తిగత గొడవలకు రాజకీయ రంగు పులిమితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ సత్తిబాబు హెచ్చరించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి కూడా ఉన్నారు.



విశాఖ ఉత్తర నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేస్తున్న బర్మా క్యాంపు ఘటనలో గాయపడిన ధనలక్ష్మి కుటుంబ సభ్యులు

- వివరాలు మెయిన్ ఎడిషన్‌లో

చెస్‌లో ఫల్గుణికి ఫిడే ఆర్బిటర్ టైటిల్



ఫల్గుణి

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 17: అంతర్జాతీయ చెస్ రంగంలో నగరానికి చెందిన మూగి ఫల్గుణి అరుదైన ఘనత సాధించింది. ప్రతిష్టాత్మక ఫిడే ఇంటర్నేషనల్ ఆర్బిటర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ టైటిల్‌కు సంబంధించి బుడాపెస్ట్‌లో జరిగిన వెజర్‌కెప్జో టోర్నీ, హంగేరిలో జరిగిన రిగో జానోస్ గ్రాండ్ మాస్టర్స్ బాలాటన్ టోర్నీ, ఆంధ్రలో జరిగిన ఫిడే రాపిడ్ చాంపియన్‌షిప్ తదితర వరుస అంతర్జాతీయ, జాతీయ టోర్నీ ల్లో ప్రాతినిధ్యం వహించింది. చివరగా ఇటీవల ఫిలిప్పిన్స్ చెస్ ఫెడరేషన్ నిర్వహించిన ఫిడే ఆర్బిటర్స్ సెమినార్‌లో పాల్గొన్న ఆమె అద్భుతమైన ప్రతిభ కనబరిచింది. దీంతో ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ ఫల్గుణికి ఫిడే ఇంటర్నేషనల్ టైటిల్‌ను ధ్రువపత్రాన్ని అందజేసింది. కాగా, ఇంటర్నేషనల్ ఫిడే ఆర్బిటర్ టైటిల్ సాధించిన తొలి ఆంధ్ర క్రీడాకారిణిగా ఫల్గుణి రికార్డు నెలకొల్పింది. ఈసందర్భంగా ఫల్గుణితోపాటు ఆమెను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను చెస్ మేధావులు, నిపుణులు అభినందించారు.

గంగవరం పోర్టులో సమ్మె విరమణ

... 5వ పేజీ తరువాయి

వారితోనూ వేరే గదిలో చర్చలు జరిపారు. త్వరలో వేతనాలు కొద్దిగా పెంచడానికి, వారి కుటుంబాలకు వైద్య సదుపాయం కల్పించడానికి యాజమాన్యం అంగీకరించినట్టు సమాచారం. దాంతో వారంతా శుక్రవారం విధులకు హాజరయ్యారు.

వివరాలు వెల్లడించని యంత్రాంగం

అదానీ గంగవరం పోర్టులో ఎప్పుడు చర్చలు జరిగినా వాటి వివరాలు బయట పెట్టే సంప్రదాయం లేదు. వాటిని అమలు చేయాల్సిందిగా కార్మికులు ఒత్తిడి తెస్తారని ఇంతవరకూ ఎప్పుడూ అలా చేయలేదు. తాజాగా జరిగిన చర్చల్లోను అదే విధానం అనుసరించారు. ప్రభుత్వ కార్యాలయంలో అధికారుల సమక్షంలో చర్చలు జరిగినా వాటిని పత్రికలకు విడుదల చేయలేదు. ఇటు అధికారులు ముందుకురాలేదు. అటు పోర్టు యాజమాన్యం చొరవ తీసుకోలేదు. దీంతో ఈ ఒప్పందాన్ని అదానీ యాజమాన్యం పూర్తిగా అమలు చేస్తుందా?, లేదా?...అనే అనుమానాలు ఉన్నాయి. చర్చల్లో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులు కూడా పొడిపొడిగా చర్చలు వివరాలు వెల్లడించారే తప్ప అన్నీ చెప్పలేదు. వారైనా విలేకరుల సమావేశం నిర్వహించి, చర్చల సారాంశం చెప్పి ఉంటే బాగుండేది.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన సీఎండీ

ఉక్కుటౌన్‌షిప్ : పోర్టు నుంచి బొగ్గు సరఫరా కావడానికి సహకరించినందుకు ఉక్కు మంత్రిత్వ శాఖకు జిల్లా యంత్రాంగానికి, కార్మిక నాయకులకు, పోర్టు కార్మికులకు ఉక్కు కర్మాగారం సీఎండీ అతుల్ భట్ కృతజ్ఞతలు తెలిపారు. ఇక ఉక్కు ఉత్పత్తిపై దృష్టిసారిస్తామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

... 5వ పేజీ తరువాయి

ఎక్స్‌ప్రెస్‌ను (06508) ఈనెల 27 నుంచి జూన్ 17 వరకు, బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్‌ను (06585) ఈనెల 31 నుంచి జూన్ 14 వరకు, హౌరా-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (06586) జూన్ ఒకటి నుంచి జూన్ 15 వరకు, ఎస్ఎంవీ బెంగళూరు-గుహవటి ఎక్స్‌ప్రెస్‌ను (06569) ఈనెల 26 నుంచి జూన్ తొమ్మిది వరకు, గుహవటి-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌ను (06570) ఈనెల 29 నుంచి జూన్ 12 వరకూ పొడిగించామని పేర్కొన్నారు. కాగా ఎస్ఎంవీ బెంగళూరు-మల్డా టౌన్‌ఎక్స్‌ప్రెస్ (06563) జూన్ 6న (ఆదివారం), మల్డా టౌన్-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (06564) జూన్ 12న (బుధవారం), మైసూరు-ముజాఫర్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (06221) జూన్ 10న (సోమవారం), ముజాఫర్‌పూర్-మైసూరు ఎక్స్‌ప్రెస్ (06222) జూన్ 13న (గురువారం) అందుబాటులో ఉంటాయని తెలిపారు.

భువనేశ్వర్ నుంచి షోలాపూర్, ముంబైలకు ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా భువనేశ్వర్ నుంచి షోలాపూర్, ముంబై స్టేషన్లకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని, అయితే ఈ రైళ్లు ఒకవైపు మాత్రమే నడవనున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 01452 నంబరు గల రైలు ఈనెల 20న (సోమవారం) ఉదయం 4.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి 11.43 గంటలకు దువ్వాడ చేరుతుంది. ఇక్కడ నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 7.00 గంటలకు షోలాపూర్ చేరుతుంది. 01056 నంబరు గల రైలు ఈనెల 20న (సోమవారం) రాత్రి 11.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 6.45 గంటలకు దువ్వాడ చేరుతుంది. ఇక్కడ నుంచి బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ముంబై వెళుతుంది.

ఎక్సైజ్ చేతివాటం

... 5వ పేజీ తరువాయి

లేనప్పటికీ, బార్ల నిర్వాహకులకు మాత్రం భారీగా సంపాదించారని చెబుతున్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు

- వి.సుధీర్, డిపో మేనేజర్

ఎన్నికల సీజన్‌లో బార్‌లకు అదనపు మద్యం కేటాయింపులు జరిగాయనే ఆరోపణల్లో వాస్తవం లేదు. ఎన్నికల సంఘం ఆదేశాలతోపాటు ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారమే కేటాయింపులు చేశాం. బార్‌లకు అదనపు కేటాయింపులు చేసి, వారి నుంచి బాక్స్‌కు రూ.వంద చొప్పున మామూళ్లు తీసుకున్నారనడం పూర్తిగా అవాస్తవం. కేటాయింపులకు సంబంధించిన గణాంకాలన్నీ పక్కాగా నమోదుచేశాం. అనుమానం ఉన్నవారెవరైనా వాటిని అడిగితే అందజేస్తాం.

రైతుబజార్లలో అడ్డగోలుగా పండ్ల దుకాణాలు

... 5వ పేజీ తరువాయి

గతంలో ఎప్పుడూ లేదు. ఈసారే అలా చేశారు.

ఇబ్బందులు లేవని ఈఓలతో లేఖలు

నగరంలోని రైతుబజార్లు వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయని 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ఒక కథనం ప్రచురించగా, మార్కెటింగ్ శాఖాధికారులు ఎస్టేట్ అధికారులను గోపాలపట్నం ఆఫీసుకు పిలిపించుకొని మాట్లాడారు. పలాస జీడిపప్పు, అనంతపురం వేరుశెనగలు, దుగ్గిరాల పసుపు, గుంటూరు కారం విక్రయించడం వల్ల మీకు ఇబ్బందులు ఉంటే రాసివ్వాలని ఒత్తిడి పెట్టారు. అలాంటిదేమీ లేకపోతే 'ఇబ్బంది లేదు' అని రాసివ్వాలని చెప్పి ఆ మేరకు లేఖలు తీసుకున్నారు. ఇదిలా ఉంటే రైతుబజార్లలో ఏ సరకునైనా బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే అమ్మాల్సి ఉండగా ఎక్కువకు అమ్ముతున్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖాధికారులు ఏమీ మాట్లాడడం లేదు. పైగా ఆ సరకులను ప్యాకింగ్ చేయడానికి, గోపాలపట్నం నుంచి బజార్లకు తీసుకువెళ్లడానికి వ్యయం కూడా బజార్ల సిబ్బందే పెట్టుకోవాలని చెబుతున్నారు. ఎవరైనా ఖర్చులు అని అడిగితే.. 'మీది తుమ్మితే ఊడిపోయే ఉద్యోగం' అది గుర్తు పెట్టుకొని పనిచేయండి అంటూ బెదిరిస్తున్నట్టు తెలిసింది. వీటన్నింటిపై జాయింట్ కలెక్టర్ సరైన విచారణ చేసి, తగిన చర్యలు తీసుకోవలసి ఉంది.

స్ట్రాంగ్‌రూమ్‌లకు మూడంచెల భద్రత

... 5వ పేజీ తరువాయి

తీశారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపరిచిన గదులకు వేసిన సీళ్లను పరిశీలించారు. పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున అక్కడ లాగ్ బుక్స్‌లో సంతకం చేశారు.

ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదకరం

- కేజీహెచ్ డౌన్ పోలీస్ క్వార్టర్స్ నుంచి లేపాక్షి వెళ్లే మార్గం తీరు



కుమ్మరివీధిలో రోడ్డు దుస్థితి

జగదాంబ కూడలి, మే 17: కేజీహెచ్ పోలీస్ క్వార్టర్స్ నుంచి లేపాక్షి మెయిన్ రోడ్డుకు కలిపే కుమ్మరవీధి రహదారి పూర్తిగా గోతులతో అధ్వానంగా మారింది. ఈ మార్గంలో నిత్యం స్కూల్ ఆటోలు, సాలిపేట, జెండాజెట్టు , పోలీస్ క్వార్టర్స్, కేజీహెచ్‌కు టూవీలర్స్.. లేపాక్షి మెయిన్ రోడ్డు నుంచి ప్రయాణిస్తుంటాయి. గత పదేళ్లుగా ఈ రహదారి నిర్మాణంపై పాలకులు శ్రద్ధ తీసుకోకపోవడం పట్ల స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ మార్గంలో నిత్యం జీవీఎంసీ వాహనాల రాకపోకలు జరుగుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం పలు విమర్శలకు దారితీస్తోంది. అలాగే, వన్‌టౌన్‌లోని పలు వీధుల్లో రహదారులు అధ్వానస్థితికి చేరాయి. చాలా ఏళ్ల అభివృద్ధికి నోచుకోకపోవడంతో గోతులతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా అధికార పార్టీ నాయకులు నిర్లక్ష్యం వహించడంతో ఈ పరిస్థితి నెలకొంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదకర మారిన ఈ రహదారుల అభివృద్ధికి జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం, మే 17 : మండలంలోని రెడ్డిపల్లి 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శేరిఖండం, రెడ్డిపల్లి, పొట్నూరు,నరసాపురం, తునివలస, చిన్నాపురం, నేరెళ్లవలస, కొయ్యపేట, భద్రయ్యపేట, సుంకరపేట తదితర గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

కొమ్మాది పరిధిలో...

కొమ్మాది : కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎన్టీఆర్ ఫీడర్ నిర్వహణ పనుల వల్ల శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ నరేష్ తెలిపారు. కొమ్మాది పీహెచ్‌సీ సెంటర్, చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, చైతన్య టెక్నో పాఠశాల, కె2 కాలనీ, కె1 కాలనీ, కె3 కాలనీ,నవోదయ పాఠశాల ప్రాంతం, డీఆర్‌కే టౌన్ షిప్, అన్నంరాజునగర్, సాయిచంద్ర లేఅవుట్, గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల, అష్టలక్ష్మీ దేవాలయం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం, మే 17 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిపారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ఆలయ బేడా మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

21న నృసింహస్వామి కల్యాణం

భీమునిపట్నం, మే 17 : పట్టణంలోని నృసింహస్వామి కొండపై ఈనెల 21న స్వామివారి కల్యాణం నిర్వ హించనున్నట్టు ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచెర్ల సింగరాచార్యులు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు సాయంత్రం 6 గంటల స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని, అనంతరం కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

టీడీపీ నాయకుడికి ఆర్థిక సాయం

తగరపువలస, మే 17 : టీడీపీ భీమిలి మండల మాజీ అధ్యక్షుడు చిట్టి వెంకటనర్సయ్యకు పార్టీ నాయకులు శుక్రవారం రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. పదేళ్ల పాటు పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన వెంకట నర్సయ్య ప్రస్తుతం అనారోగ్యం బారినపడి ఆర్థిక ఇబ్బందులతో ఉండడంతో ఒకటో వార్డు నాయకులు విషయాన్ని గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు ఆయన రూ.50 వేలు ఇచ్చారు. ఈ మొత్తాన్ని పార్టీ నాయకులు తగరపువలసలో నర్సయ్య ఇంటికి వెళ్లి అందజేశారు.

వెలిగిన వీధి లైట్లు

ఆరిలోవ,మే 17 : పెదగదిలి కొండవాలు ప్రాంతంలోని వీధి లైట్లకు అధికారులు ఎట్టకేలకు మరమ్మతు చేశారు. కొద్ది రోజులుగా కొండవాలు ప్రాంతంలో వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్న విషయమై 'ఆంధ్రజ్యోతి'లో మూడు రోజుల క్రితం కథనం వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన సంబంధిత అధికారులు వీధి లైట్లకు మరమ్మతులు చేశారు.

ఏపీ హంస నూతన కార్యవర్గం

ఎంవీపీ కాలనీ, మే 17 : ఏపీ హంస (హెల్త్ విభాగం) విశాఖ జిల్లా కమిటీ, సిటీ కార్యవర్గం, భీమిలి తాలూకా నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం ఎంవీపీ కాలనీలో జరిగింది. విశాఖ జిల్లా అధ్యక్షుడిగా చిన్నబాబు, కార్యదర్శిగా బాబీ, కోశాధికారిగా శ్రీనివాస్, సిటీ అధ్యక్షుడిగా సత్యనారాయణ, కార్యదర్శిగా వై. గోపి, కోశాధికారిగా వెంకటేష్, భీమిలి తాలూక కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సినిమా గైడ్

- **బాక్** : జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు** : మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం** : శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి** : వెంకటేశ్వర.
- **రత్నం** : అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది** : రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్** : కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్** : శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్** : శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 24, టమాటా 25, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 30, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 34, బీరకాయలు 46, ఆనపకాయలు 24, కాలీఫ్లవర్ 34, క్యాబేజ్ 24, క్యారెట్ 28, దొండకాయలు 27, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 146, బరబటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 185, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 40, కీరదోస 26, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 138
ఫారం ధర	-- 158
విత్ స్కిన్	-- 286
స్కిన్‌లెస్	-- 296



గంటా శ్రీనివాసరావుతో కోరాడ రాజబాబు, తదితరులు



వంగలపూడి అనితను కలిసిన 98వ వార్డు నాయకులు

కూటమి గెలుపు ఖాయం : గంటా

పద్మనాభం (రూరల్), మే 17 : రాష్ట్రంతో పాటు భీమిలి నియోజకవర్గంలో కూటమి గెలుపు ఖాయమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో పద్మనాభం మాజీ ఎంపీపీ కాళ్ల నగేష్‌కుమార్, అనంతవరం నాయకులు శుక్రవారం ఎంవీపీ కాలనీలో గంటాను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని 22 పంచాయతీల్లో ఉన్న 45 పోలింగ్ బూతుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఏయే బూతుల్లో ఎంత మెజారిటీ వస్తుందని నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంటా మాట్లాడుతూ ఓటింగ్‌లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. కూటమి మేనిఫెస్టో వారికి ఉపయోగకరంగా ఉండడంతో అధిక శాతం ఓటింగ్ జరిగిందని చెప్పారు. ఏదిఏమైనా చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనంతవరం నాయకులు లోకవరపు గోవిందు, సిద్దనాతి వెంకటరావు, కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గంటా, అనితలను కలిసి 98వ వార్డు టీడీపీ శ్రేణులు

సింహాచలం : ఎన్నికలు ప్రశాంతంగా జరిగిన నేపథ్యంలో 98వ వార్డు కార్పొరేటర్ పీవి నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కూటమి అభ్యర్థులు గంటా శ్రీనివాసరావును, వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిసారు. ఇద్దరు నేతలను వారి నివాసాలకు వెళ్లి కలిసి జ్ఞాపికలు అందజేశారు.

ఈ సందర్భంగా భీమిలి, పాయకరావుపేట నియోజక వర్గాల్లో జరిగిన పోలింగ్ సరళి గురించి ఆయా అభ్యర్థులు నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సింహగిరి వర్తక సంఘం ప్రతినిధి పండూరి మురళీ, 98వ వార్డు టీడీపీ ఉపాధ్యక్షుడు పట్నాల ధర్మరాజు, తెలుగు యువత కార్యదర్శి గుసిడి అవినాష్‌బాబు, భీమిలి తెలుగు యువత కార్యదర్శి రౌతు రాంబాబు, వార్డు బీసీ విభాగం అధ్యక్షుడు గంట్రెడ్డి వెంకటరమణ, లండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవాలకు సిద్ధంగా ఉండండి : బీజేపీ

పెదవాల్తేరు : ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయమని విశాఖ జిల్లా బీజేపీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. శుక్రవారం ఆయన నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరం బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలోని కూటమి అభ్యర్థులంతా తప్పకుండా విజయం సాధిస్తారని చెప్పారు. జూన్ 4న విజయోత్సవ సంబరాలకు బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాసరావు, శ్రీ రంగం ధవళేశ్వరరావు ఉన్నారు.

'తూర్పు'లో అత్యధిక పోలింగ్

- గతంతో పోల్చితే పెరిగిన ఓటింగ్ శాతం
- తోటగరువు బీఎన్ఆర్ నగర్‌లో అత్యధికంగా 1231 మంది ఓటు



విశాఖపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం ఏర్పాటు తరువాత ఈసారే అత్యధికంగా 68.64 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ తరువాత 2009 ఎన్నికల్లో 68.22 శాతం పోలింగ్ జరిగింది. తరువాత 2014లో 62.43, 2019లో 64.73 శాతానికి పడిపోయింది. ఈసారి పోలింగ్‌లో అనేక ఇబ్బందులు తలెత్తినా ఓటింగ్ 68. 64 శాతానికి పెరిగింది. అయినా రాష్ట్రంలో అతి తక్కువ ఓట్లు పోలైన నియోజకవర్గాల్లో తూర్పు ఒకటి. ఇక్కడ 293 పోలింగ్ బూత్‌లు ఉండగా అతి తక్కువగా ఎంవీపీ కాలనీ సెక్టార్-5లో బూత్ నంబరు-114లో 287 మంది ఓటర్లకు 184 మంది ఓటు వేశారు. అత్యధికంగా తోటగరువు బీఎన్ఆర్ నగర్‌లో బూత్ నంబరు- 0లో 1525 మందికి 1231 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 200 నుంచి 300 మంది ఓటు వేసే బూత్‌ల సంఖ్య 13 ఉండగా, 301 నుంచి 400 మంది వరకు ఓటు వేసే బూత్‌ల సంఖ్య 18, 401 నుంచి 500 మంది ఓటేసిన బూత్‌ల సంఖ్య 28 ఉన్నాయి. 501 నుంచి 600 మంది ఓటర్లు ఓటేసిన బూత్‌ల సంఖ్య 50, 601 నుంచి 700 వరకు ఓట్లు వేసిన బూత్‌ల సంఖ్య 48 ఉండగా 701 నుంచి 800 మంది ఓటేసిన బూత్‌లు 44 ఉన్నాయి. 801 నుంచి 900 మంది ఓటు వేసిన బూత్‌లు 41 ఉండగా 901 నుంచి 1000 వరకు ఓట్లు పోలైన బూత్‌ల సంఖ్య 27 ఉన్నాయి. ఉన్నత వర్గాలు, అపార్టుమెంట్లలో ఉన్న ఓటర్లతో పాటు సొంతూళ్లకు వెళ్లే ఓటర్లలో ఎక్కువ మంది ఓటు వేయలేదు. మత్స్యకారులు ఎక్కువగా ఉండే పెదజాలారిపేట సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన బూత్ 160లో 1416 మందికి 1210 (85.45 శాతం) మంది ఓటేశారు. ఇక్కడ బూత్ ముందు షామియానా ఏర్పాటు చేయకపోయినా ఎండలో మాడుతూ ప్రజలు ఓటేశారు.బూత్ నంబరు 162 జాలారిపేటలో 1422కి 1200 మంది (84.38శాతం), పెదజాలారిపేటలో బూత్ నంబరు 166లో 1546 మందికి 1148 మంది (74.25శాతం), బూత్ నంబరు 161లో 1338 మందికి 1080 మంది 80.71 శాతం) ఓట్లు వేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ఆరాధనోత్సవం

సింహాచలం, మే 17 : కాల జ్ఞానాన్ని మానవాళికి అందించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం 98వ వార్డు వరాహ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏటా వీరబ్రహ్మేంద్రస్వామి సమాధిలోకి వెళ్లిన రోజున ఆరాధనోత్సవం చేయడం ఆనవాయితీ. ఈమేరకు వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి సంఘ కార్యకర్తలు పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు చేశారు.

చట్టాలను అతిక్రమించొద్దు : సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమేష్

భీమునిపట్నం (రూరల్), మే 17 : చట్టాలను అతిక్రమించి ఎవరూ ప్రవర్తించరాదని సీఐ డి. రమేష్ సూచించారు. శుక్రవారం ఆయన ఎస్ఐ హరీష్‌తో కలిసి నాగమయ్యపాలెంలో గ్రామ దేవత పండుగ సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది పండుగ సమయంలో కొట్లాటలు జరిగాయని, ఈసారి అలా లేకుండా పండుగ చేసుకోవాలని చెప్పారు. కొత్త వ్యక్తులు గ్రామంలోకి వస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనంతుని క్షేత్రంలో చందనోత్సవం రేపు

పద్మనాభం, మే 17 : అనంత పద్మనాభుని దేవస్థానంలో ఆదివారం వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున కుంతీమాధవస్వామి మూలవిరాట్టుకు చందనోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి ప్రీతికరమైన వైశాఖ మాసంలో ఏకాదశి అయిన ఆ రోజు ఉదయం 5 గంటలకు వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అర్చనలు చేసిన అనంతరం కుంతీమాధవుడిని చందనాన్ని అలంకరిస్తామన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు చందనాలంకృతం చేసిన స్వామి దర్శనాన్ని భక్తులకు కల్పిస్తామన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీసెట్

పెందుర్తి, మే 17: ఏపీ ఈఏపీసెట్ శుక్రవారం చినముషిడివాడ, సుజాతనగర్‌లోని ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. రెండు రోజులుగా ఉదయం, మధ్యాహ్నం షిఫ్టులలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పరీక్షలకు సుమారు రెండు వేల మంది విద్యార్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.



చినముషిడివాడ కేంద్రం వద్ద అభ్యర్థులు

8, 9వ వార్డుల్లో అంధకారం




విశాలాక్షినగర్, మే 17 : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విశాలాక్షినగర్ మెయిన్ రోడ్డు, జోడుగుళ్లపాలెం, కైలాసగిరి కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, రెవెన్యూ కాలనీ, చలపతినగర్, రామాలయం వీధిలో గత కొద్ది రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. ఈ ప్రాంతంలో మహిళా ఉద్యోగులు, విద్యార్థులు ఎక్కువగా నివసిస్తుండడంతో రాత్రి వేళ ఒంటరిగా ఇళ్లకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లైట్లు వెలగడం లేదని సచివాలయాల్లో స్థానికులు ఫిర్యాదు చేస్తే మొక్కుబడిగా చిన్న చిన్న మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాగర్‌నగర్ : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగక అంధకారం నెలకొంది. సాగర్‌నగర్ ఎంఐజీ-సి-, ఎంఐజీ -డి- బ్లాక్‌ల మధ్య ఉన్న రహదారిపై ఆరు నెలలుగా లైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ అటువైపు రాకపోకలు చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సాగర్‌నగర్ ఎంఐజీ ఎ, ఎంఐజీ బి, ఎల్ఐజీ ఎ, బి, బ్లాక్‌ల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. తీర ప్రాంత గ్రామాల్లో దొంగల భయం ఎక్కువ. దీనికితోడు వీధి లైట్లు వెలగకపోవడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.

'మాజీ ఎంపీపీపై దాడి సరికాదు'

పద్మనాభం, మే 17 : రెడ్డిపల్లిలో ఈనెల 13న మాజీ ఎంపీపీ డి. గోపాలకృష్ణమూర్తిరాజును వైసీపీ నాయకులు అడ్డుకొని దాడికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు కె. రమణ చెప్పారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గోపాలకృష్ణమూర్తిరాజు పోలింగ్ రోజున అన్ని గ్రామాలు తిరిగి వస్తుండగా రెడ్డిపల్లిలో జెడ్పీటీసీ సభ్యుడితో పాటు అతని అనుచరులు కారును అడ్డుకొని తీవ్రంగా దుర్భాషలాడి, బెదిరించడం సరికాదన్నారు. ఓటమి భయంతో ఇటువంటి దురాగతాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

సింహగిరిపై హరివిల్లు



సింహాచలం, మే 17 : సింహగిరిపై పశ్చిమ దిక్కున శుక్రవారం ఉదయం హరివిల్లు ఆవిష్కృతమైంది. సుమారు 20 నిమిషాల పాటు కనిపించిన ఈ సుందర దృశ్యాన్ని అటు అప్పన్న భక్తులతో పాటు ఇటు 98వ వార్డుకు చెందిన ప్రజలు చూసి ఆనంద పరవశులయ్యారు. ఈ దృశ్యాన్ని కొందరు సెల్‌ఫోన్లలోనూ, మరికొందరు కెమేరాల్లోనూ బంధించారు.

భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- ప్రాంతీయ అగ్నిమాపక అధికారి డి. నిరంజన్‌రెడ్డి

విశాఖపట్నం, మే 17: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగిన భద్రతా చర్యలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి డి.నిరంజన్‌రెడ్డి కోరారు. ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ చాప్టర్ నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా హోటల్ దసపల్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదాలకు సంబంధించిన సమాచారం ఎప్పుడూ 20 నుంచి 30 నిమిషాల తరువాతే సంబంధిత శాఖకు చేరుతోందని,అయితే కేవలం రెండు నిమిషాల్లో సమాచారం ఇచ్చే అవకాశం ఉందన్నారు.దీనివల్ల ప్రమాద తీవ్రతను తగ్గించడంతో పాటు సత్వరమే అదుపులోకి తీసుకువచ్చే అవకాశముందన్నారు. ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు వి. శ్రీనివాస్ విశాఖ చాప్టర్ నూతన అధ్యక్షుడిగా ఆర్. రామకృష్ణారావు, కార్యదర్శిగా కె. కుమార్‌రాజు ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎన్ దాస్, ఎఫ్ఎస్ఏఐ రీజనల్ డైరెక్టర్ ఎస్.ప్రసాదరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రావణి షిప్పింగ్‌లో అత్యుత్తమ ఫైర్‌సెఫ్టీ అమలు చేస్తున్నందుకు సంస్థ అధినేత డాక్టర్ జి.సాంబశివరావుకు అవార్డు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి



శుక్రవారం చందనం పేకెట్ల కోసం క్యూలో ఉన్న భక్తులు

నేడు ఒలుపు చందనం విక్రయాలు నిలుపుదల

సింహాచలం, మే 17 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఒలుపు చందనం విక్రయాలను శనివారం నిలుపుదల చేస్తున్నట్టు దేవాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19, 20, 21 తేదీల నుంచి మళ్లీ విక్ర యాలు కొనసాగుతాయని చెప్పారు. ఈనెల 16 నుంచి ప్రారంభమైన ఒలుపు చందనం విక్రయాలు శుక్రవారం కూడా కొనసాగాయి. రెండవ రోజు చందనం ప్రసాదాల కొనుగోలుకు ఉత్తరాంధ్ర నలుమూలలు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సూర్యోదయం నుండే క్యూలో బారులు తీరారు. ఒకదశలో క్యూ ప్రసాదాల విక్రయాల కేంద్రం నుంచి సుమారు వంద మీటర్ల దూరంలో ఉన్న నిత్యాన్న ప్రసాద భవనం వరకు కనిపించింది. దేవాలయ ఏఈఓ ఎన్. ఆనందకుమార్ విక్రయాల కౌంటర్ వద్ద స్వయంగా ఉండి పర్యవేక్షిస్తూ వెయ్యి పేకెట్ల వరకూ విక్రయించారు.

నేటి నుంచి రెండో విడత చందనం అరగదీత

సింహాచలం, మే 17 : వరాహలక్ష్మీనృసింహస్వామికి వైశాఖ పూర్ణిమి అనగా ఈనెల 23న రెండో విడత చందనం సమర్పించనున్నారు. అందుకు అవసరమైన మూడు మణుగుల (120 కిలోల) చందనపు ముద్దను అరగదీసేందుకు శనివారం ముహూర్తంగా నిర్ణయించారు. ఆలయ బేడా మండపంలో చందనం అరగదీయడానికి ఇప్పటికే 18 సానలను ఏర్పాటు చేశారు. నాలుగో తరగతి సిబ్బంది సంప్రదాయ దుస్తుల్లో నోటికి గుడ్డలు కట్టుకుని భక్తితో చందనం అరగదీయనున్నారు.

'భూగర్భ జలాలను కాపాడుకుందాం'



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గ్రీన్ క్లైమేట్ సభ్యులు

సింహాచలం, మే 17 : భూగర్భ జలాలను కాపాడుకొని జీవ వైవిధ్య ప్రణాళికల్లో భాగస్వాములు కావాలని జలశక్తి మిషన్ జల వనరుల విశ్రాంత శాస్త్రవేత్త కృష్ణ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంలో భాగంగా శుక్రవారం సింహాచలం దేవస్థానానికి చెందిన నృసింహవనం గోశాలలో ఏకో వైజాగ్, గ్రీన్ క్లైమేట్ బృందం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమస్త జీవరాశిని కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. బెంగళూర్‌లో ప్రస్తుతం ఉన్న నీటి కొరత వంటి పరిస్థితులు భవిష్యత్‌లో మరెక్కడా తలెత్తకుండా ఉండాలంటే భూగర్భ జలాలను సంరక్షించుకోవాలన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి చెట్లను పెంచే బాధ్యత తీసుకోవాలని కోరారు. అలాగే వర్షపు నీటిని ఒడిసి పట్టాలని తెలిపారు. ప్రకృతి ఆధారిత రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ మాట్లాడుతూ ఏకో వైజాగ్ లక్ష్యం దిశగా అందరూ కృషి చేయాలన్నారు. ప్రకృతి ఆధారిత పంటలు, మిద్దె తోటలు పెంచి ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డీఈ రామరాజు (హరి), గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీఓ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏకో వైజాగ్ ప్లకార్డులను ప్రదర్శించారు.

26న ఆర్‌కే బీచ్‌లో వైట్ మారథాన్



వైట్ మారథాన్ టీ షర్టులను ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఆరిలోవ, మే 17 : నగరంలోని ఆర్‌కే బీచ్ రోడ్డులో ఈనెల 26న కంటి కేన్సర్‌కు సంబంధించిన రెటినో బ్లాస్టోమాపై అవగాహన కల్పిస్తూ వైట్ మారథాన్ నిర్వహించనున్నట్టు హనుమంతవాక జంక్షన్ సమీపంలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు తెలిపారు.శుక్రవారం ఆ కార్యక్రమానికి సంబంధించిన టీ షర్టులను డాక్టర్ పీజే శ్రీనివాస్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ బాపారావు, సెక్రటరీ బాలకృష్ణరాయ్, డాక్టర్ వీరేంద్ర సచిదేవ్, తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పిల్లలకు సంక్రమించే రెటినో బ్లాస్టోమా వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఈ మారథాన్ చేపడుతున్నామన్నారు.

ఏయూను సందర్శించిన అమెరికా ప్రొఫెసర్

వెంకోజీపాలెం, మే 17 : ఏయూను అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ మంగిలాల్ అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్‌లతో సమావేశమయ్యారు. బోధన, పరిశోధన భాగస్వామ్యం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలని భావించే విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, పీహెచ్‌డీ, పోస్టు డాక్టర్ల కోర్సులు, ఆన్‌లైన్ కోర్సులు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు ఆచార్య జి. గిరిజాశంకర్, ఆచార్య కె. ఈశ్వర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలు వాయిదా

పాడేరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు వాయిదా పడ్డాయి. ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవాలను జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది. సార్వత్రిక ఎన్నికల తరువాత రాష్ట్రంలో ప్రధానంగా పల్నాడు జిల్లాలో జరిగిన హింస, అవాంఛనీయ ఘటనల నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు అనుమతులు ఇవ్వలేమని కలెక్టర్ ఎం.విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం తేల్చిచెప్పారు. ఒకవేళ ఉత్సవాలను నిర్వహించుకోవాలనుకుంటే, ఎటువంటి హడావిడి లేకుండా కేవలం ఆలయంలో అమ్మవారికి పూజలతోనే సరిపెట్టాలని సూచించారు. దీంతో ఉత్సవాలను నిర్వహించలేమని, తాజా ఘటనల నేపథ్యంలో ఉత్సవాలను వాయిదా వేసి జూన్ 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతిధులు పేర్కొన్నారు.

తగరపువలస ప్రజలకు ప్రయాణ కష్టాలు

- రెండు కిలోమీటర్ల దూరంలో సర్వీసు రోడ్డు
- చుట్టూ తిరగలేక వాహనదారుల అవస్థలు

తగరపువలస, మే 17 : జాతీయ రహదారి విస్తరణ వల్ల తగరపువలస, చిట్టివలస గ్రామాలకు నేరుగా వెళ్లడానికి మార్గం లేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. విశాఖ నుంచి తగరపువలస బైక్‌లపై రావాలంటే ఆనందపురం మండలం వెల్లంకి వద్ద సర్వీసు రోడ్డులో ప్రయాణించాల్సి ఉంది. విజయనగరం, శ్రీకాకుళం నుంచి వచ్చేవారు రాజాపులోవ వద్ద సర్వీసు రోడ్డులో రావాల్సి ఉంది. సిటీ బస్సులు మాత్రం సర్వీసు రోడ్డులో వెళ్తుంటాయి. ఎక్స్‌ప్రెస్, ఇతర బస్సులు ఎక్కాలన్నా, వాటిపై వచ్చేవారు దిగి తగరపువలస రావాలన్నా..రెండు కిలోమీటర్ల ముందు సంగివలస మూడు గుళ్ల కూడలి వద్ద దిగాల్సి ఉంది. అలాగే విజయనగరం రోడ్డులో వచ్చేవారు అంతి కళాశాల ముందు తగరపువలస వంతెన వద్ద దిగి వెనక్కి రావాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనాలపై వచ్చేవారు తెలియక విశాఖ నుంచి వస్తే నేరుగా రాజాపులోవ వెళ్లిపోయి అక్కడ నుంచి మళ్లీ మూడు కిలోమీటర్లు వెనక్కి రావాల్సి వస్తోంది. బైక్‌ల వరకూ తగరపువలస కూడలి వద్ద మార్గం ఏర్పాటు చేస్తే బాగుంటుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.